ఆంధ్రపత్రిక
గుంటూరు - బాపట్ల
మంగళవారం 31 డిసెంబరు 2024 పేజీలు : 8

## డబ్బులు వసూల్ చేసే అధికారులను
# తక్షణమే సస్పెండ్ చేయండి

**కమిషనర్‌ను ఆదేశించిన ఎమ్మెల్యే కన్నా..**



**సత్తెనపల్లి, డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):**సత్తెనపల్లి పురపాలక సంఘ పరిధిలో పనిచేయని సచివాలయం సెక్రటరీలను, డబ్బులు వసూల్ చేసే అధికారులను తక్షణ మే సస్పెండ్ చేయండి అంటూ స్థానిక శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ మున్సిపల్ కమిషనర్ కె.షమ్మీని ఆదేశించారు. సోమవారం జరిగిన మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో ఎక్స్ అఫీషియో సభ్యుని మిగతాది 2లో

# వైసీపీకి షాక్

- పార్టీకి గంజి చిరంజీవి రాజీనామా
- జనసేనలో చేరిక
- జనసేన కండువా వేసి సాదరంగా ఆహ్వానించిన పవన్ కళ్యాణ్



**మంగళగిరి, డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):**మంగళగిరి వైఎస్‌ఆర్సిపికి ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో ఆయన సోమ వారం సాయంత్రం జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉప ముఖ్య మంత్రి పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేనలో చేరారు. ఆయనతోపాటు చిరంజీవి సతీమణి గంజి రాధా కూడా మిగతాది 8లో

## నేడు యల్లమంద రానున్న
# ప్రజా నాయకుడు సీఎం చంద్రబాబు



- 11.05 నిమిషాలకు హెలిప్యాడ్ వద్ద సీఎంకు నేతలు, స్వాగతం పలుకనున్న అధికారులు..
- 11.10 గంటల నుంచి 11.40 వరకు పింఛన్లు అందజేత..
- 11.45గంటల నుంచి 12.45 వరకు పింఛనుదారులు, యల్లమంద గ్రామస్థులతో మాటామంతీ
- కోదండరామస్వామి దేవాలయం సందర్శన..

**చిలకలూరిపేట డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):**సీఎం చంద్రబాబునాయుడు నరసరావుపేట మండలం యల్లమంద గ్రామానికి ఈనెల 31న రానున్నారు. ఉదయం 10.30 గంటలకు ఉండవల్లిలో బయల్దేరి 11 గంటలకు యల్లమంద గ్రామానికి చేరుకుంటారు. 11.05 నిమిషాలకు హెలిప్యాడ్ వద్ద సీఎంకు నేతలు, అధికారులు స్వాగతం పలుకుతారు. 11.10 గంటల నుంచి 11.40 వరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు గ్రామంలో అందజేస్తారు. 11.40గంటల నుంచి 11.45 మధ్య యల్లమంద గ్రామంలోని కోదండరామస్వామి దేవాలయాన్ని సందర్శిస్తారు. 11.45 గంటల నుంచి 12.45 వరకు పింఛనుదారులు, యల్లమంద గ్రామస్థులతో మాట్లాడతారు. 12.45 నుంచి 12.50 మధ్య హెలిప్యాడ్ ప్రాంతంలో భోజనం చేస్తారు. 12.50 నుంచి 1.05 వరకు జిల్లా అధికారులతో మిగతాది 2లో



' కూటమి ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు, నూతన సంవత్సరం సందర్భంగా, మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు రాష్ట్ర, నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మాటలలో....

# వెలితి లేని పాలన

- 7 నెలల పాలన
- ఏమాత్రం లేదు వెలితి..
- అన్నివర్గాల వారిలో అంతులేని సంతృప్తి... సంతోషం.
- రాష్ట్ర ఆర్థిక దుస్థితిని చక్కదిద్దుతూనే, సంపద సృష్టి దిశగా అడుగులు.
- ఉనికి కోసం పాకులాడుతున్న ప్రతిపక్షం.
- 200 రోజుల్లోనే ప్రజల ఆశలు, ఆకాంక్షలు నిజం చేసిన చంద్రబాబుతో రూ..1000 పింఛన్‌ను ఐదేళ్ల పాటు పెంచిన జగన్ రెడ్డికి పోలికా అంటున్న రాష్ట్ర ప్రజలు
- ప్రత్తిపాటి పుల్లారావు

**చిలకలూరిపేట డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):**రాష్ట్రంలో ఈ ఏడాది మే లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారి టీతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయ దుంధుభి మోగించింది. ప్రజల ఆశలు,ఆకాంక్షలు, ఆశయాల ప్రతిరూపంగా కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. కొత్త ప్రభుత్వం సరికొత్త ఒరవడితో పాలన సాగిస్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే గాక, వారి ఆశల్ని నూటికినూరు శాతం నెరవేర్చింది. హంగు, ఆర్భాటాలకు దూరంగా రెడ్ కార్పెట్ స్వాగతాలకు, అంచెలంచెల భద్రతా వలయాలకు స్వస్తి చెబుతూ, చంద్రబాబు సహా మొత్తం కేబినెట్ ప్రజల కోసం, ప్రజల్లో ఒకటిగా కలిసిపోయింది. **ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు...** అధికారం చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు మిగతాది 2లో



## మహానగరంలో మాయగాళ్లు..

**బ్యాంకుల్లో మరియు ప్రైవేటు ఫైనాన్సర్ల దగ్గర లోన్లు ఇప్పిస్తాం అంటూ సామాన్యులకు కుచ్చుటోపి పెడుతున్న కేటుగాళ్లు. నయవంచకుల మాటలకు మోసపోయి సర్వం కోల్పోతున్న అభాగ్యులు..**

**గుంటూరు,డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):** గుంటూరు నగరంలో మాయగాళ్లు విచ్చలవిడిగా రెచ్చిపోతున్నారు. సైబర్ నేరగాళ్లు ఒక్కసారిగా అభాగ్యుల బ్యాంకు ఖాతాలు దోచేస్తుంటే, లోన్లు చేస్తాం అని వచ్చే కీటుగాళ్లు మాత్రం సామాన్యులను ప్రతి రోజు దోచేస్తున్నారు. లక్షల్లో మిగతాది 2లో

**నియోజకాల అభివృద్ధికి**

# అభ్యర్థనలు తెలపండి

**ఎంపీ, ఎమ్మెల్యేలను కోరిన జిల్లా ఇన్ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు**



**నరసరావు పేట, డిసెంబరు 30 (ఆంధ్రపత్రిక):**రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలిసారి జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో నియోజక వర్గాల పరిధిలో అభివృద్ధి అవసరాలు, అవకాశాలపై ప్రతిపాదనలను తెలియజేయాలని జిల్లా ఇన్ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు ఎంపీ, ఎమ్మెల్యేలను కోరారు.స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎంపీ, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. ప్రజాప్రతినిధుల మిగతాది 2లో

# వెలితి లేని పాలన

(మొదటిపేజీ తరువాత)

తీసుకున్న గొప్ప నిర్ణయం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు. ప్రజల.. ప్రభుత్వ భూములు తమ సొంత భూములన్నట్టు భావించి వాటిని కాజేయడానికి జగన్ అండ్ కో తీసుకొచ్చిన భూస్వాహా చట్టాన్ని ఒక్క కలం పోటుతో రద్దుచేయడం ద్వారా చంద్రబాబు ప్రజల మనసులు గెలిచారు.

**సామాజిక పింఛన్ రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంపు...**
అదే ఊపులో ఇచ్చిన హామీ ప్రకారం సామాజిక పింఛన్లను రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచారు. ఎన్నికల కారణాలతో నిలిచిపోయిన 3 నెలల పింఛన్ ను జూలైలో ఒకేసారి అందించి పింఛన్ దారుల ముఖాల్లో చిరునవ్వులు పూయించారు.

**అన్నాక్యాంటీన్ల పునరుద్ధరణ...**
పేదల కడుపు కొట్టిన జగన్ రెడ్డికి భిన్నంగా, కేవలం రూ.5తో మూడు పూటలా వారి కడుపునింపే అన్నా క్యాంటీన్లను ప్రారంభించడం మరో మంచి కార్యమనే చెప్పాలి. 2014-19లోనే చంద్రబాబు అన్నా క్యాంటీన్ల ద్వారా లక్షలాది పేదల ఆకలి బాధలు తీర్చారు. జగన్ రెడ్డి అధికారంలోకివచ్చేశాక వాటిని మూసేసి, వారి ఉసురు పోసుకున్నాడు.

**నిర్మాణ రంగం పుంజుకునేలా నూతన ఇసుకపాలసీ...**
గత ప్రభుత్వం దోపిడీ వనరుగా మార్చుకున్న ఇసుకను ఇదివరకటి మాదిరే ప్రజలకు ఉచితంగా అందిస్తూ, చంద్రబాబు సర్కార్ తీసుకున్న నయా నిర్ణయం నిర్మాణ రంగంతో పాటు, అనుబంధ రంగాలకు కొత్త ఊపిరిపోసిందనే చెప్పాలి. జగన్ హయాంలో పస్తులున్న లక్షలాది కార్మికులకు చేతినిండా పని దొరకడమే కాక, రాష్ట్ర ఆదాయం పెంపుదలకు నూతన ఇసుక పాలసీ దోహదం చేసిందనడం అతిశయోక్తి కాదు. కొత్త ఇసుక పాలసీకి సంబంధించి రవాణా ఛార్జీల విషయంలో కొన్ని చోట్ల వచ్చిన విమర్శలపై వెంటనే దిద్దుబాటు చర్యలను కూడా కూటమి ప్రభుత్వం చేపట్టింది.

**మహిళలకు ఏటా ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు...**
పెరిగిన గ్యాస్ ధరలతో మహిళలు పడుతున్న కష్టాలకు పరిష్కారంగా ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు వంట గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్న హామీని గత దీపావళి నుంచే చంద్రబాబు అమల్లో పెట్టి మహిళల మన్ననలు పొందారు.

**కాటేసిన కల్తీ మద్యానికి స్వస్తి....** గంజాయి, ఇతర మాదకద్రవ్యాల కట్టడికి ప్రత్యేక టాస్క్ ఫోర్స్.
అన్నింటికంటే ప్రధానంగా కల్తీ మద్యంతో మందుబాబుల ప్రాణాలతో చెలగాటమాడి, మహిళల పుస్తెలు తెంపిమరీ తన వ్యక్తిగత ఖజానా నింపుకున్న జగన్ రెడ్డి దుష్ట ఆలోచనకు భిన్నంగా నూతన మద్యం పాలసీని కూటమి సర్కార్ తీసుకొచ్చింది. కల్తీ మద్యం స్థానంలో నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకు అందుబాటులో ఉంచింది. రాష్ట్రంలో ఎక్కడా కల్తీమద్యానికి, బెల్టు షాపులకు తావులేకుండా చేసింది. అదే క్రమంలో నేరాలకు మూలమైన గంజాయి కట్టడికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేసింది. తొలుత జూన్లో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిన కూటమి ప్రభుత్వం, ఇటీవలే యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ (ఏ.ఎన్.టీ.ఎఫ్) ఏర్పాటుకు ఆమోదం తెలపడం ద్వారా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు, నాటుసారా, ఇతర మత్తు పదార్థాల కట్టడికి కఠిన చర్యలు చేపట్టింది.

**సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు:**జగన్ సర్కార్ పూర్తిగా విస్మరించిన రోడ్ల నిర్మాణం, మరమ్మతులపై కూటమి ప్రభుత్వం వెంటనే దృష్టి సారించింది. సీఎం చంద్రబాబు స్వయంగా పరవాడ మండలంలో రోడ్ల గుంతలు పూడ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సహా ప్రజాప్రతి నిధులందరూ విధిగా కొత్త రోడ్ల నిర్మాణంపై దృష్టి పెట్టాలని, సంక్రాంతి నాటికి రాష్ట్రంలో ఎక్కడా రోడ్లపై గుంతలు ఉండకూడదని ముఖ్య మంత్రి ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 70 శాతం వరకు రోడ్ల నిర్మాణం, మరమ్మతుల పనులు పూర్తయ్యాయి. **గత పాలకుల దోపిడీకి బలైన వ్యవస్థలకు పునరుత్తేజం.:** హామీల అమలుతో పాటు గత ప్రభుత్వవిధానాలు, పాలకుల దోపిడీకి బలైన ప్రజలు, సంస్థలు, వ్యవస్థలను గాడిలో పెట్టే చర్యలను చంద్రబాబు ఆయన బృందం వేగవంతం చేసింది. వివిధ శాఖల్లోని పెండింగ్ బిల్లులను క్లియర్ చేయడంతో పాటు, పోలీస్, ఆర్టీసీ, తదితర విభాగాలకు జగన్ సర్కార్ ఏళ్ల నుంచి బకాయి పెట్టిన నిధుల్ని ప్రభుత్వం విడుదలచేసింది. నిధుల లేమితో జగన్ హయాంలో నీరుగారిపోయిన పంచాయతీలకు రూ.16,739 కోట్ల నిధులు మంజూరు చేసింది. జగన్ సర్కార్లో ముంబై నటి ఎదుర్కొన్న వేధింపులతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, టీడీపీ..జనసేన.. బీజేపీ శ్రేణులు ఎదుర్కొన్న తప్పుడు కేసులను క్రమపద్ధతిలో, కూటమి ప్రభుత్వం సమీక్షిస్తోంది. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీతో పాటు, విద్యార్థులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలుకు సర్వం సిద్ధమైంది. 60 సంవత్సరాలు దాటిన వారికి ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణ ఛార్జీలపై 25 శాతం రాయితీ కల్పించింది. యువతకు 25 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్న హామీ అమలు దిశగా అడుగులు వేస్తోంది. ఆ క్రమంలో భాగంగా ఇప్పటికే ప్రఖ్యాత ఉక్కుసంస్థలైన ఆర్సెలార్ మిట్టల్, నిప్పాన్ స్టీల్స్ సంస్థలతో చర్చలు జరిపి, పరిశ్రమల ఏర్పాటు కోసం 2,200ఎకరాల భూకేటాయింపులు చేసింది. ఈ సంస్థల ఏర్పాటుతో రాష్ట్రానికి 1.47లక్షలకోట్ల పెట్టుబడులతో పాటు, 55వేల మందికి ఉపాధి లభించనుంది. 6100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ఉన్న అడ్డంకులను తొలగించింది. సూపర్ సిక్స్ పథకాలతో పాటు, ప్రజలకు ఇచ్చినసంపద పెంపు హామీ సహా, రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వాన్ని తన అనుభవం, ముందుచూపు, మేధస్సుతో చంద్రబాబు ముందుకు తీసుకెళుతున్నారు.

**రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం పనుల్లో పురోగతి.**
జగన్ దుర్బుద్ధితో నిలిచిపోయిన పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంపై చంద్రబాబు సమీక్ష చేశారు. ఆగిపోయిన పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టారు. పోలవరంతో పాటు, వివిధ ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందించే వివిధ ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్ల నిర్మాణం కూడా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతిఎకరాకు నీళ్లు ఇవ్వాలనే సత్సంకల్పంలో భాగంగా, ఏపీని 100శాతం కరువురహిత రాష్ట్రంగా మార్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది.

**అమరావతి నిర్మాణ దిశగా అడుగులు...**
ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రపంచబ్యాంక్, ఏడీబీ రుణాలు మంజూరు అయ్యేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రాజధానిలో భూమిలేని కూలీలకు ఇచ్చే పెన్షన్ను మరో ఐదేళ్లకు పొడిగించింది. కౌలు రైతులకు కోపరేటివ్ బ్యాంకు ద్వారా రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంది.

ఇవన్నీ ఒకెత్తు అయితే బుడమేరు వరద ధాటికి కకావికలమైన విజయవాడ నగరాన్ని పునర్నిర్మించడం చంద్రబాబు పనితీరుకు మెచ్చుతునక. జేసీబీలు, బోట్లపై ప్రయాణించి మరీ ప్రజల కష్టసుఖాల్లో చేదోడుగా నిలిచి, సర్వం కోల్పోయిన వరద బాధితులకు అండగా తానున్నానని ముఖ్యమంత్రి ధైర్యం చెప్పిన తీరు, నభూతో.. అన్నట్టు నిలిచింది.

ఇలా వందరోజుల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో మెజారిటీ భాగం అమలుచేసి వారి సంతోషం, సంతృప్తిని నూటికి వెయ్యి శాతం పొందడమే గాక, సంపద సృష్టి దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది అనేది రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ అంగీకరించాల్సిన వాస్తవం. వాస్తవాలను అంగీకరించే నైజం, విశాల దృక్పథం జగన్ రెడ్డికి, ఆయనపార్టీ శ్రేణులకు లేదు కాబట్టి, తమ రాజకీయ ఉనికికోసం, ప్రజలు తమను మరిచిపోకూడదన్న దూరాలోచనతో పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారు. జగన్ రెడ్డి.. వైసీపీ నాయకులు ఎంత గొంతుచించుకున్నా, ఉన్నవి లేనివి పనిగట్టుకొని ప్రచారం చేసినా, ఉనికి కోసం ఎంతగా వెంపర్లాడినా ప్రజలు ఎప్పటికీ వారిని విశ్వసించరనేది కాదనలేని సత్యం.

కొత్త సంవత్సరం సందర్భంగా రాష్ట్ర మరియు నియోజకవర్గ ప్రజలు.. కూటమి పాలకుల నిర్ణయాలు, జనరంజక పాలనను కొత్త ఆలోచనలు, సరికొత్త ధోరణితో స్వాగతించాలని, సదా మా..మీ.. మనందరి ప్రభుత్వాన్ని ఆదరించి, అభిమానించాలని కోరుతూ...

మాజీ మంత్రి, శాసనసభ్యులు
ప్రత్తిపాటి పుల్లారావు.

# మహానగరంలో మాయగాళ్లు..

(మొదటిపేజీ తరువాత)

లోన్లు ఇప్పిస్తా మని వస్తారు, లేబర్ లైసెన్స్ అని, లాగిన్ ఫీజ్ అని, ప్రాసెసింగ్ ఫీజు అని లోన్ రాక ముందే వాళ్లు పెట్టుకున్న టార్గెట్ కి డబ్బు లు గుంజుకుంటారు.పాపంలోను వస్తుందని ఆశతోటి వీటన్నిటికీ ఫీజులు కడతానికి అభాగ్యుల దగ్గర డబ్బులు లేకపోయినా అధిక వడ్డీలకు అప్పులు తీసుకవచ్చి ఈ కేటుగాళ్ల వలలో పడుతున్నారు సామాన్యులు. ఈ మాయగాళ్లు చెప్పిన మెత్తటి మాటలు నమ్మి వారు అడిగినంత డబ్బులు ఇచ్చిన తరువాత వారం పది రోజులు వాళ్లు బాగానే మాట్లాడుతారు.లోను విషయం అడుగుదామని ఫోన్ చేసినప్పుడు ఈ నెలాఖరుకు అయిపోయింది లేదా వచ్చే నెల మొదటి వారంలో అయిపోయిందని సుతి మెత్తని మాటలతో సామాన్యుల కడుపు నింపుతారు. తీరా వాడు చెప్పిన తేదీకి లోను కాలేదు అని వాళ్లకు ఫోన్ చేస్తే ఫోన్లు కలవు, లేదా నెంబర్లు బ్లాక్లిస్టులో పెడతారు. లేదా ఫోన్ లిఫ్ట్ చేయడం మానేస్తారు కొన్ని వందల సార్లు ఫోన్ చేసినా దానికి సమాధానం అయితే ఉండదు. ఒకవేళ ఫోను లిఫ్ట్ చేసిన మేము మీటింగ్లో ఉన్నాం ఒక అరగంట ఆగి చేస్తాం రెండు నిమిషాల్లో చేస్తాం అని మాట దాటేస్తారు. రెండు నిమిషాలు రెండు రోజులైనా ఫోను చేయరు డబ్బులు కోసం వచ్చినప్పుడు మెత్తటి మాటలతో కడుపు నింపిన ఈ కేటుగాళ్లు ఇప్పుడు వాళ్ల కడుపు మీద తంతున్నారు. వడ్డీలకు డబ్బులు తీసుకువచ్చి ఈ కేటుగాళ్ల వలలో పడి అటు లోను రాక, ఇటువంటి మాటలు పడలేక జీవితాలని అర్ధాంతరంగా ముగిస్తున్నారు ఎందరో అమాయకులు.. **ఇటువంటి వారి కథనాల గురించి 10-01-2025 నాడు ఆంధ్రపత్రిక తప్పకుండా చదవండి..**

# డబ్బులు వసూల్ చేసే అధికారులను తక్షణమే సస్పెండ్ చేయండి



(మొదటిపేజీ తరువాత)

హోదాలో పాల్గొన్న శాసన సభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ హాజరై మాట్లాడారు. కౌన్సిల్ సమావేశంలో జనసేన పార్టీ కౌన్సిలర్ రంగి శెట్టి సుమన్ మాట్లాడుతూ సత్తెనపల్లి పట్టణం, వడ్డవల్లిలోని 12వ సచివాలయంలో అధికారుల తీరు చాలా దారుణంగా ఉందన్నారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్, ఓ వార్డ్ ప్రజాప్రతినిధిగా ఉన్న నన్నే అక్కడి అధికారులు ఓ పని మీద వెళ్తే దురుసుగా మాట్లాడారని స్థానిక ఎమ్మెల్యేకు రంగిశెట్టి ఫిర్యాదు చేశారు. కొన్ని సచివాలయాల్లో నాలాంటి వాళ్ల పని మీద కలవండి అంటే గవర్నమెంట్ రూల్స్ ఫాలో అవుతున్నట్లు తిప్పుతున్నారని, అదే పనికి బయట వ్యక్తులను పంపిస్తే 3 నుండి 5 వేలు వసూలు చేస్తూ పలు సచివాలయాల్లో చేతివాటంతో పనులు జరుగుతున్నట్లు, ఆధారాలు కూడా నా దగ్గర ఉన్నాయని సుమన్, ఎమ్మెల్యే కు తెలియచేశారు. ఇది కూటమి ప్రభుత్వం అని, పలానా వ్యక్తి చెప్తే చేస్తామనే ధోరణి సచివాలయాల్లో లేకుండా అక్కడ పని చేసే ప్రతి అధికారిలో మార్పు వచ్చేలా చేయాలని ఎమ్మెల్యేను సుమన్ కోరారు. శాసన సభ్యులు కన్నా మాట్లాడుతూ తక్షణమే అన్ని సచివాలయాల అధికారులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేయాలని, ప్రతి సచివాలయంపై, ఆ సెక్రటరీలపై పర్యవేక్షణ ఉండాలన్నారు. సచివాలయ అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. మీరు వారిపై రూట్ ఆఫ్ ప్లానింగ్ ఎందుకు అమలు చేయట్లేదని, గతంలో కూడా అనేక ఫిర్యాదులు వచ్చాయని, పని చేయని వారిని గుర్తించి వెంటనే వారిని సస్పెండ్ చేయండి... అని కమిషనర్ షమ్మిని శాసన సభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ ఆదేశించారు. పట్టణంలో సచివాలయం అధికారి బెదిరించినా, డబ్బులు వసూలు చేసినట్లు తేలితే ఏ వ్యక్తితో పని లేకుండా నా కార్యాలయానికి వచ్చి ప్రజలు స్వయంగా నన్ను కలవండి...అంటూ మీడియా ముఖంగా ఎమ్మెల్యే తెలియజేశారు.4వ వార్డ్ టీడీపీ కౌన్సిలర్ కటకం రామకృష్ణ మాట్లాడుతూ...మున్సిపల్ స్థలాలు కబ్జా కాకుండా చూడాలని, విలేకరుల కాంప్లెక్స్ మనోహర్ హోటల్ వెనుక మున్సిపల్ స్థలంలో బోర్డ్ లు ఏర్పాటు వేయాలని రామకృష్ణ కోరారు. స్టేషన్ రోడ్ లో ఉన్న తారక రామ సాగర్ చుట్టూ ఫెన్సింగ్ వేయాలని, గతంలో కూడా చెప్పామని కటకం రామ కృష్ణ కమిషనర్ కు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి, అధికారులు టీడీపీ, జనసేన, వైసీపీ కౌన్సిలర్స్ పాల్గొన్నారు.

## నియోజకాల అభివృద్ధికి అభ్యర్థనలు తెలపండి

(మొదటిపేజీ తరువాత)

కోరిక మేరకు నియోజకవర్గ సమస్యలు చర్చించేందుకు ముఖ్యమంత్రి పర్యటన అనంతరం జనవరి 4వ తేదీన డీఆర్సీ సమావేశం నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. జిల్లాలో పర్యాటక అభివృద్ధి విషయమై అటవీ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేలు కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, నరసరావు పేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ మరియు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## యల్లమంద రానున్న ప్రజానాయకుడు సీఎం చంద్రబాబు

(మొదటిపేజీ తరువాత)

సమావేశం ఉంటుంది. అనంతరం 1.35 నుంచి 1.50 మధ్యలో కోటప్పకొండ చేరుకుంటారు. 1.50 గంటల నుంచి 2.20 వరకు త్రికోటేశ్వరస్వామి దర్శనం, పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు. 2.35 గంటలకు కోటప్పకొండ నుంచి యల్లమంద గ్రామంలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 2.40 గంటలకు యల్లమందలో బయలుదేరి 3.10గంటలకు ఉండవల్లి చేరుకుంటారని అధికారవర్గాలు తెలిపాయి.

## నిర్ణీత కాలంలోనే రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తాం




**కర్లపాలెం డిసెంబర్ 30(ఆంధ్రపత్రిక):** గ్రామాల జరుగుతున్న రెవెన్యూ సదస్సుల వల్ల రైతుల భూ సమస్యలు తక్షణమే పరిష్కరించే అవకాశం ఏర్పడిందని తహసీల్దార్ సుందరమ్మ తెలిపారు. గణపవరం సోమవారం గ్రామపంచాయతీ దగ్గరజరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడుతూ రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామ సభల్లో అర్జీలను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. భూవివాదాలు,పట్టాదారు పాస్ పుస్తకాలలో పొరపాట్లను, నిర్ణీత వ్యవధిలో పరిష్కరిస్తామని ఆమె తెలిపారు.

# ఇసుక అక్రమ త్రవ్వకాలను ఉపేక్షించబోము

## కలెక్టర్ మురళి



**బాపట్ల బ్యూరో, డిసెంబర్ 30(ఆంధ్రపత్రిక):** ఇసుక అక్రమ తవ్వకాలు, తరలింపులు బాపట్ల జిల్లాలో జరిగితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని ఆర్డిఓలను జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణా, తరలింపులపై ఆర్డీవోలతో సోమవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ లో ఆయన సమావేశం నిర్వహించారు. ఇసుక అక్రమ తవ్వకాలు, తరలింపులు అరికట్టడానికి టాస్క్ ఫోర్స్ కమిటీలు సమర్థంగా పనిచేసేలా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ చెప్పారు. ప్రతి మండల స్థాయిలో టాస్క్ ఫోర్స్ కమిటీలు చురుగ్గా ఉండాలన్నారు. పట్టా భూములు, అసైన్డ్ భూములు, రైల్వే భూములు, చెరువు పోరంబోకు భూ ములలో ఇసుక తవ్వకాలకు బాపట్లలో ఎలా ంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. అక్రమ లేఅవుట్ లు వేసినా సహించేది లేదన్నారు. చీరాల, వేటపాలెం తదితర మండలాలలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. విధుల పట్ల నిర్లిప్తంగా వ్యవహరించిన తహసిల్దార్లపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మీ డివిజన్ మొత్తం పూర్తిగా మీ ఆధీనంలో ఉండాలన్నారు. అధికారులు మరింత నిబద్ధతతో పనిచేయాలని హెచ్చరించారు. విధుల పట్ల నిర్లిప్తంగా వ్యవహరించిన రెవిన్యూ అధికారులపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని కలెక్టర్ చెప్పారు. చీరాల తహసిల్దార్ కె.గోపికృష్ణకు షోకాజ్ నోటీస్ జారీ చేశామన్నారు. చీరాల మండలం ఆర్ఐ కె నాగ కుమార్, అదే మండలంలో తోటవారిపాలెం విఆర్ఓ ఎస్.శివరామిరెడ్డి, బోయినవారిపాలెం విఆర్ఓ పి.తులసీరావులను సస్పెండ్ చేశామని కలెక్టర్ తెలిపారు. అక్రమాలు జరుగుతుంటే పట్టించుకోకుండా ఉన్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్‌డిఓలు పి గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, పాల్గొన్నారు.

# నూతన సంవత్సర వేడుకలు ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి



**బాపట్ల బ్యూరో,డిసెంబర్ 30(ఆంధ్రపత్రిక):**సైలెన్సర్ లేకుండా తీవ్రమైన రణగొణ ధ్వనులు సృష్టిస్తూ ఇతరులకు ఇబ్బందికరంగా ద్విచక్ర వాహనాలు నడిపితే వాహనం సీజ్ చేస్తామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ప్రజలను హెచ్చరించారు. డిసెంబర్ 31న రాత్రి జరుపుకొనే నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకొనేందుకు ప్రజలకు పలు సూచనలు చేస్తూ డిసెంబర్ 30న సోమవారం జిల్లా ఎస్పీ పత్రిక ప్రకటన విడుదల చేసినారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా శాంతియుత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్ డ్రైవింగ్ చేయవద్దని యువతకు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన, మైనర్లు వాహనాలు నడిపిన, అతివేగంగా నిర్లక్ష్యంగా, రణగొణ ధ్వనులు సృష్టిస్తూ వాహనాలు నడిపిన వాటిని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిని ఉపేక్షించేది లేదన్నారు. వారిపై కేసులు నమోదు చేసి సంబంధిత కోర్టులలో హాజరుపరిచి భారీ మొత్తంలో జరిమానా విదించేవిధంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుంపులు, గుంపులుగా తిరుగుతూ ఇతరులను ఇబ్బందులకు గురిచేసే విధంగా వ్యవహరించినా, మహిళలు, యువతులను వేధించినా, ఈవ్ టీజింగుకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవన్నారు. బహిరంగ పార్టీలు నిర్వహించడం, నృత్యాలు చేయడం, పరిమితికి మించిన ధ్వనితో డీజేలు ఏర్పాటు చేయడం, బాణాసంచా కాలుస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.ప్రభుత్వం నిర్ధేశించిన సమయం వరకు మాత్రమే మద్యం విక్రయాలు జరపాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆయా మద్యం దుకాణాలు, బార్లపైన చర్యలు తీసుకుంటామన్నారు. నూతన సంవత్సర వేడుకల పేరుతో డిసెంబరు 31న అర్ధ రాత్రి ఒంటి గంట తరువాత ప్రజలెవ్వరూ రహదారులపై, వీధులలో తిరగరాదన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలలో భాగంగా డిసెంబర్ 31 రాత్రి పోలీస్ అధికారులు, సిబ్బంది ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తారన్నారు. ముఖ్యమైన కూడళ్లలో పికెట్స్ ఏర్పాటు చేసుకొని వాహన తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పోలీస్ శాఖ ఆదేశాలను పెడచెవిన పెట్టి చట్టాన్ని ఉల్లంఘించి వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని, అటువంటి వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా యువతపై కేసులు నమోదైతే భవిష్యత్‌లో ప్రభుత్వ, ప్రవేటు ఉద్యోగాలలో చేరాలంటే ఇబ్బందులు ఎదురవుతాయని గ్రహించాలన్నారు. యువత చట్టాన్ని ఉల్లంఘించి నమోదైన కేసులతో నూతన సంవత్సరంలో అడుగు పెడతారో,నూతన సంతోషంతో కొత్తగా ఎంచుకున్న ఆశయాలను ఛేదించాలనే లక్ష్యంతో అడుగుపెడతారో అనేది దృష్టిలో ఉంచుకొని వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరిస్తూ ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని ఎస్పీ తెలిపారు.

## సదర్‌లాండ్ గ్లోబల్ సర్వీసెస్‌కు 103 మంది సెయింట్ ఆన్స్ విద్యార్థుల ఎంపిక



**వేటపాలెం, డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):**ప్రముఖ సదర్‌ల్యాండ్ గ్లోబల్ సర్వీసెస్‌కు 103 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణా రావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీష్ బాబు మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులతో కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. సదర్‌ల్యాండ్ గ్లోబల్ సర్వీసెస్ వారు 2025 సంవత్సరంలో ఇంజినీరింగ్ పూర్తి కాబోయే విద్యార్థులకు వర్చువల్ పద్దతిలో ఇటీవల నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో 103 విద్యార్థులు ఎంపికవ్వడం సంతోషదాయకమన్నారు. ఎంపికైన వారిలో సి.యస్.ఇ విభాగము నుండి 31మంది, ఇ.సి.ఇ విభాగము నుండి 34మంది, ఇ.ఇ.ఇ నుండి 4గురు, సివిల్ ఇంజినీరింగ్ విభాగము నుండి 5 గురు, ఎ.ఐ.యం.యల్ నుండి 19మంది, సైబర్ సెక్యురిటి విభాగము నుండి ఇద్దరు, డెటా సైన్స్ విభాగము నుండి ఆరుగురు, ఐ.ఒ.టి విభాగము నుండి ఇద్దరు ఉన్నారన్నారు. అనంతరం కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నూతలపాటి పూర్ణచంద్ర రావు మాట్లాడుతూ ఈ ప్రాంగణ ఎంపికలలో ఎంపికైన విద్యార్థులకు రు.2.70 లక్షల వార్షిక వేతనము ఇతర అలవెన్సులు లభిస్తాయని తెలిపారు. సదర్‌ల్యాండ్ గ్లోబల్ సర్వీసెస్ లో ఎంపికైన విద్యార్థులకు డా. సి. సుబ్బారావు, డైరక్టర్ (అక్రిడిటేషన్స్) ఆర్.వి. రమణ మూర్తి, మేనేజర్, (ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్) సి.యస్.ఇ విభాగాధిపతి డా. పి.హరిణి, ఇ.సి.ఇ విభాగాధిపతి డా. డి. రాజేంద్ర ప్రసాద్, ఇ.ఇ.ఇ విభాగాధిపతి డా. కె. అనిల్ కుమార్ , సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి టి. కిరణ్ కుమార్, ఎ.ఐ.యం.ల్ విభాగాధిపతి డా? సి. హరి కిషన్, ఐ.ఒ.టి విభాగాధిపతి డా. యస్. ఇంద్రనీల్, సైబర్ సెక్యూరిటి విభాగాధిపతి డా. యం. రమేష్ మరియు వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

## పోలీస్ సిబ్బంది ఫిర్యాదుదారులతో

# మర్యాదగా వ్యవహరించాలి



**బాపట్ల బ్యూరో డిసెంబర్ 30(ఆంధ్రపత్రిక):**ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్. ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ పోలీస్ అధికారులను హెచ్చరించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు వారి సమస్యలను స్వయంగా ఎస్పీకి విన్నవించుకుని, వ్రాతపూర్వకమైన అర్జీలను అందజేస నారు. భువివాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు వంటి పలు సమస్యలపై 40 మంది తమ అర్జీలు అందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో త్వరితగతిన విచారించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరిస్తామన్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, పి.జి.ఆర్.ఎస్ సెల్ ఎస్.ఐ శ్రీనివాసరావు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలకు వెంటనే అధికారులు పరిష్కారం చూపాలి

### జిల్లా కలెక్టర్ మురళి

**బాపట్లబ్యూరో,డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):**ప్రజా సమస్యల పరిష్కారంలో వచ్చిన అర్జీలను పరిష్కరించ డంలో నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను హెచ్చరించారు. సోమవారం స్థానిక కలెక్టర్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికను కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యలు పరిష్కార వేదికలు వచ్చిన అర్జీలపై అధికారులు తక్షణమే స్పందించాలని ఆయన అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను పరిష్కరించడానికి రెవెన్యూ డివిజన్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లు పట్టివేత



**వేటపాలెం,డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):** మండలంలో ఇసుక క్వారీలకు ఎటువంటి అనుమతులు లేకున్నా కొందరు భూ బకాసరులు ఇసుకను అక్రమంగా ట్రాక్టర్ల పై తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఎన్ హెచ్ 216 పై పికెటింగ్ ఏర్పాటు చేయటం జరిగిందని, అదే సమయంలో ఇసుక లోడుతో వెళుతున్న 5 ట్రాక్టర్లను పట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగిందని ఎస్ఐ ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. రైడ్ లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రహదారులను ప్రయాణానికి అనువుగా మార్చాలి

### రోడ్లు మారమ్మతులకు రూ. 27.92కోట్లు... కలెక్టర్ మురళి



**బాపట్ల బ్యూరో, డిసెంబర్ 30(ఆంధ్రపత్రిక):** రహదారులపై ప్రజలు సురక్షితంగా ప్రయాణించడం ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని జిల్లా కలెక్టర్ జె.వెంకట ముర ళి తెలిపారు. రహదా రులపై గుంతలు పూడ్చే కార్యక్రమంపై రోడ్లు, భవనాలుశాఖ అధికారులు, గుత్తేదారులతో సోమవారం స్థానిక కలెక్టర్ చాంబర్లో ఆయన సమీక్ష నిర్వహించారు.జిల్లాలోని ప్రధాన రహదారుల మరమ్మతులు, గుంతలు పూడ్చే ప్రక్రియ గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.అధికారులు నిత్యాదారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే పనులు ప్రారంభం కానీ ఏజెన్సీలకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. జనవరి 15వ తేదీలోగా పనులు పూర్తి కాకపోతే నోటీసులు ఇవ్వాలన్నారు. కంకర తరలించే సమయంలో మైన్స్ అధికారులు పన్ను వసూలు చేస్తున్నారని, తదుపరి ఆర్ అండ్ బి అధికారులకు అదే వాహనానికి పన్నులు చెల్లించాల్సి వస్తుందని గుత్తేదారులకలెక్టర్‌కు విన్నవించారు. స్పందించిన కలెక్టర్ రాష్ట్ర ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను తక్షణమే పరిష్కరిస్తున్న నేపథ్యంలో జనవరి 30వ తేదీ నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. అప్పటికి చేయకపోతే గుత్తేదారుల ఒప్పందాలు పూర్తిగా రద్దు చేయాలని స్పష్టం చేశారు. పాత పద్ధతిలో మాదిరిగా పనిచేస్తే సహించేది లేదన్నారు. బాపట్ల జిల్లాలోని రాష్ట్రీయ రహదారులపై 22 పనులు మంజూరు కాగా, 159 కిలోమీటర్ల మేర పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఇందు కొరకు రూ.5.35 కోట్ల నిధులు వచ్చాయన్నారు. కేవలం 73 కిలోమీటర్ల మేర 9 పనులు మాత్రమే పూర్తయ్యాయన్నారు. జిల్లాలోని ప్రధాన రహదారులపై మొత్తం 584 కిలోమీటర్ల మేర మరమత్తులు చేపట్టాల్సి అండగా 101 పనులుగా విభజించినట్లు తెలిపారు. ఇందు కొరకు రూ.27.92 కోట్లు నిధులు వచ్చాయన్నారు. ఒప్పందాల గడువు సమీపిస్తున్నప్పటికీ ప్రస్తుతం 224 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేయడంపై ఆరా తీశారు. నిధులు పుష్కలంగా ఇచ్చినప్పటికీ పనులు జరగక పోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఒప్పందాల మేరకు పనులు వేగంగా పూర్తి చేయాలని, జాప్యం చేస్తే సహించేది లేదన్నారు. ప్రజల నుంచి అసంతృప్తి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రహదారులు భవనాల శాఖ ఎస్ఈ వి శ్రీనివాసరావు, డిఈలు, గుత్తేదారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ చేసిన ఎస్ఐ



**వేటపాలెం,డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):** మార్కెట్ సెంటర్‌లోని ఆటో డ్రైవర్లకు సోమవారం వేటపాలెం ఎస్ఐ ఎం.వెంకటేశ్వర్లు కౌన్సిలింగ్ నిర్వ హించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించా లని, లైసెన్సులు అందరూ కలిగి ఉండాలని, నిబంధనల మేరకు ప్యాసింజర్లను ఎక్కించాలని, సెల్ ఫోన్ మాట్లాడుతూ ఆటో నడపరాదని తెలిపారు. నూతన సంవత్సర వేడుకలు ప్రారంభం కాబోతున్నందున ఆటో డ్రైవర్లు తాగి ఆటోలు నడపరాదని, వివాదాలు సృష్టించరాదని హెచ్చరించారు. ఈ నిబంధనలను మండలంలోని ఏ ఆటో డ్రైవర్ ఐనా ఉల్లంఘన చేస్తే చర్యలు కఠిన తరంగా ఉంటాయన్నారు.

# అన్నం పెట్టడం అంటే ప్రాణం నిలబెట్టడమే







**అమరావతి, డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):** అన్నం పెట్టడం అంటే వారి ప్రాణం నిలబెట్టడమేనని శీలంనే ని రఘువరన్,తేజస్విని వివాహం సందర్భంగా పేదల కు భోజనం పెట్టేందుకు ముందుకు వచ్చిన శీలంనేని సాంబశివరావు, ఇందిరాదేవి దంపతులు అభినందనీ యులని జనచైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు అన్నారు.పెదకూరపాడుకు చెందిన కాకతీయ విద్యాసంస్థల నిర్వాహకులు, రొటేరియన్ శీలమనేని సాంబశివరావు,ఇందిరాదేవి దంపతుల కుమారుడు రఘువరన్,తేజస్విని వివాహం సంద ర్భంగా జన చైతన్య సమితి ఆధ్వర్యంలో అమరావతి, ధరణికోట ప్రాంతంలోని 500 మంది పేదలకు అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరి సాంబశి వరావు మాట్లాడుతూ ఫంక్షన్లలో మిగిలిన ఆహారాన్ని పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులకు రఘువరన్ వివాహం సందర్భంగా పేదలకు అన్నదానం చేద్దా మని చెప్పడంతో అమరావతి నుంచి విజయవాడ వెళ్లే రోడ్డులో డంపింగ్ యార్డ్ వద్ద ఉన్న యానాది కాలనీలో, ధరణికోటలో ఉన్న చెంచు కాలనీలో భోజనాలు తీసుకువెళ్లి పెట్టామన్నారు.శుభకార్యాల సమయంలో కొంతమంది పేదరికైనా అన్నదానం చేయాలనే శీలంనేని కుటుంబ సభ్యుల మంచి మనసు కు తుళ్లూరి సాంబశివరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్య క్షులు దాసరి విజయ్ బెన్నిబాబు, వాలంటీర్లు బెజ్జం నాగేశ్వరరావు, తుళ్లూరి వెంకటేశ్వర్లు,బెల్లంకొండ మోహన్,దాసరి కారుణ్య బాబు, రాగిడి ప్రేమ్ కుమార్ తదితరులు ఉన్నారు

## నూతన సంవత్సర వేడుకలు బాధ్యతగా జరుపుకోవాలి

### రాజుపాలెం ఎస్సై వేణుగోపాల్



**రాజుపాలెం, డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):** ఆంగ్ల నూతన సంవత్సరం 2025 వేడుకలు ప్రజలు బాధ్యతగా జరుపుకోవాలని రాజుపాలెం ఎస్సై వేణుగోపాల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ 31 జనవరి 1వ తేదీ వేడుకలను ప్రజలు బాధ్యత రహితంగా జరుపుకొని సంతో షంగా ఉండాలని కోరారు. అదేవిధంగా నూతన సంవత్సర సందర్భం గా పోలీసులు ఆంక్షలు ప్రజలు పాటించాలని కోరారు. తదుపరి ఆకతాయిలు నూతన సంవత్సర సందర్భంగా రాత్రి వేళల్లో మహిళలకు ప్రజలకు ఆటంకం కలిగించిన ఎడల స్థానిక పోలీసులకు సమాచారం తెలపాలని కోరారు. నూతన సంవత్సర సందర్భంగా పలు గ్రామాల్లో పోలీసు పెట్రోలింగ్ ముమ్మరంగా కొనసాగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. న్యూ ఇయర్ సందర్భంగా ప్రధాన రహదారులు బహి రంగ ప్రదేశాల్లో సంబరాలు నిర్వహించి ప్రజలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటా మని అన్నారు. మద్యం సేవిం చి సంబరాలు చేసుకోరాదని రోడ్డు ప్రమాదాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. అనంతరం ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు ఎస్సై తెలిపారు. రాజుపాలెం పోలీస్ స్టేషన్ సేవలను ప్రజలు ప్రశంసిస్తున్నారు.

## ఒక రోజు ముందుగా పెన్షన్ పంపిణీ



**కాకుమాను, డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):**జనవరి నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఒక రోజు ముందుగా పంపిణీ చేయనున్నట్లు కాకుమాను మండల ఎంపిడిఓ కే.యుగ కీర్తి తెలిపారు.ఈ సందర్భంగా ఎంపిడిఓ యుగ కీర్తి మాట్లాడుతూ 31వ తేదీ ఉదయం నుండి సిబ్బంది లబ్ధిదారులకు పెన్షన్ నగదు ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేయనున్నారని తెలిపారు.ప్రతి గ్రామ సచివాలయంకు ఒక నోడల్ అధికారిని కేటాయించినట్లు తెలిపారు.సంబంధిత అధికారులు సిబ్బందినీ సమన్వయం చేసుకొని పెన్షన్ నగదు పంపిణీ త్వరితగిన పూర్తి చేయాలన్నారు.గ్రామల వారిగా యుగ కీర్తి ఎంపిడిఓ (కాకుమాను 1), కెన్నెడీ విద్యా శాఖ అధికారి (అప్పాపురం),రవీంద్ర రెడ్డి పిఆర్వి ఈ(బి కే పాలెం), రవి బాబు ఈఓపిఆర్డి (బోడిపాలెం),వెంకాయమ్మ ఐసీడీఎస్ సూపర్ వైజర్ (చిన లింగాయ పాలెం),మౌలాలి ఖాన్ విద్యుత్ శాఖ ఏఈ (గరిక పాడు),విజయ భాస్కర్ ఎంఈ ఓ (కాకుమాను 2) సుజాత ఏపిఎం (కొమ్మూరు), కిరణ్మయి ఏఓ (కొండ పాటూరు), సింగారావు ఏపిఓ (పాండ్రా పాడు), రత్న కిషోర్ ఏఈ ఇరిగేషన్ (రేటూరు), రమేష్ ఏఈఆర్ ఢబ్ల్యు ఎస్ (వల్లూరు)లను కేటాయించమన్నారు.ప్రతి ఒక్క సిబ్బంది ఎన్టీఆర్ భరోసా పెన్షన్ నగదు పంపిణీ కర్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని తెలియజేశారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 150 విద్యార్థులకు దంత పరీక్షలు





**పెదనందిపాడు, డిసెంబర్ 30 (ఆంధ్రప్రత్రిక):**పెదనందిపాడు జడ్పీహెచ్ పాఠశాలలో సోమ వారం రోటరీ క్లబ్ వారు విద్యార్థులకు పళ్ళ పరీక్షల శిబిరం నిర్వహించారు ఈ శిబిరంలో గుంటూరు అపురా డెంటల్ క్లినిక్ డాక్టర్ ఫణీంద్ర 150 మంది విద్యార్థులకు పళ్ళు పరీక్షలు నిర్వహించారు నిర్వహించడం పెదనందిపాడు మండల రోటరీ క్లబ్ అధ్యక్షులు ఎన్ శివప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ జిల్లా మీడియా డైరెక్టర్ పోపూరి లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షులు పోపూరి నాగేశ్వరరావు. విక్టర్ జాన్ పాల్. పాఠశాల ప్రధానోపాధ్యాయిని లక్ష్మీ దుర్గ . పూర్వ విద్యార్థి సంఘ నాయకుడు వెల్లంకి శివరాం ప్రసాదు.తదితరులు పాల్గొన్నారు..

## బిజెపి మండల అధ్యక్షులుగా వెలగా గంగాధర్ రావు





**పెదనందిపాడు, డిసెంబర్ 30 (ఆంధ్రప్రత్రిక):**పత్తిపాడు నియోజక వర్గం, పెద నందిపాడులో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్ష నియామకం సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగింది,పార్టీ సంస్థాగత ఎన్నికల అధికారి టీ.వి.ఎస్. కృష్ణారెడ్డి, పరిశీలకులు వై.వి.సుబ్బారావులు నూతన అధ్యక్షునిగా ఎన్నికైన వరగానికి చెందిన వెలగా గంగాధరరావుకి నియామక పత్రం అందచేశారు, కార్యక్ర మంలో రాష్ట్ర నాయకులు పరాంకుశం శ్రీనివాసరావు, వి.పాండురంగ విఠల్, జంధ్యాల వేంకట రామలింగేశ్వర శాస్త్రి, జిల్లా నాయకులుతోట శ్రీనివాసరావు, కన్నా రవిదేవరాజు పాల్గొన్నారు, ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు వెలగా గంగాధరరావు మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన భాధ్యత ని నిర్వర్తించటానికి శాయశక్తుల కృషి చేస్తానని, పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటానని తెలిపా రు, నూతన అధ్యక్షునికి నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలి యచేసారు, నాయకులు సిహెచ్.నాగిరెడ్డి, బి.బాజీ బాబు, భీమినేని రవి, కొల్లా నరేన్ బాబు, జి.నవీన్ చక్రవర్తి, వి.రాఘవయ్య చౌదరి, వి. యస్వంత్,ఏ.నవీన్, పి.సుధీర్ బాబు, టి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## పోలేరమ్మ హుండీ ఆదాయం 5.18 లక్షలు



**కాకుమాను, డిసెంబర్ 30 (ఆంధ్రప్రత్రిక):**మండల పరిధిలోని కొండ పాటూరు గ్రామంలో వేంచేసియున్న స్వయంభూ శ్రీ పోలేరమ్మ అమ్మవారి హుండీ లెక్కింపు సోమవారం నాడు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు,గ్రామ ప్రజలు సమక్షంలో నిర్వహించారు.ఈ సందర్భముగా ఆలయ ఈ ఓ సురేష్ బాబు మాట్లాడుతూ గడిచిన మూడున్నర నెలల కాలానికి సంబంధించి హుండీ లెక్కింపు జరిగినట్లు తెలిపారు.5 లక్షల 18 వేల 4 వందల 68 రూపాయలు నగదు వచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ బాపట్ల ఇన్స్పెక్టర్ గోపి,ఆలయ పూజారి నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు దానయ్య, శ్రీనివాసరావు, నరేంద్ర, రవి, సాంబయ్య సిజిబిబి బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు

# ఆరోగ్యానికి రక్ష



**బెల్లంకొండ, డిసెంబర్ 30 (ఆంధ్రప్రత్రిక):**ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యానికి రక్షణ ఇస్తాయని మండల మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్స్ పవన్, అంజలి అన్నారు. బెల్లంకొండ మండలంలోని పలు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కూరగాయలను కొందరు రైతులు పండిస్తున్నారు.ఈ కూరగాయలను ప్రతి సోమవారం తాసిలా ్ద ర్ కార్యాలయం వద్ద స్థానం ఏర్పాటు చేసి అవసరమైన అధికారులకు పలు రకాల పనులపై కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అందు బాటులో ఉంచి అమ్మకాలు జరుపుతున్నారు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలు ఆహారంలో చేర్చడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వారు తెలిపారు. ఈ కార్యక్ర మంలో మార్కెటింగ్ సిబ్బంది తేజశ్రీ, నిర్మల్ బాబు, మండల యూని టీ ఇన్చార్జి తిరుపతమ్మ, ఐసిఆర్పిలు మహాలక్ష్మి, పద్మ,పంటను పండించిన రైతులు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

### వాటర్ ప్లాంట్స్ యాజమాన్యం

## బాటిల్స్‌తో నీళ్లు అమ్మకూడదు

**బాపట్ల బ్యూరో,డిసెంబర్ 30(ఆంధ్రప్రత్రిక):**జిల్లాలోని బాపట్ల పురపా లక సంఘ పరిధిలోని వాటర్ ప్లాంట్స్ ను గుంటూరు సీనియర్ వాట ర్ ఎనలిస్ట్ వి.రాజరావు, మునిసిపల్ కమిషనర్ జి.రఘునాథ రెడ్డి తో కలిసి ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్లాంట్ల నందు నీటి నమూనాలను సేకరించి ప్లాంట్ యజమానులకు పలు సూచనలు చేశారు. పరిసరా లు ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్లాంట్ నిర్వహణకు సంబంధించి అన్ని శాఖల అనుమతి తప్పక పొందాలన్నారు. నమూ నా పరీక్షల అనంతరం అవకతవకలున్నచో చట్టపరమైన చర్యలు తీసు కుంటామన్నారు. వాటర్ బాటిల్స్ నందు నీరు నింపి అమ్మకూడదన్నా రు. వారి వెంట మునిసిపల్ ఇంజనీర్ కృష్ణా రెడ్డి సచివాలయ సిబ్బంది ఉన్నారు.

### దాచేపల్లి ఎంఈవో 1 కాంతారావు

# హఠాన్మరణం



**దాచేపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రప్రత్రిక):** పల్నాడు జిల్లా దాచేపల్లి మండల విద్యా శాఖాధికారి 1కె.కాంతారావు (57) హఠాన్మ రణం చెందారు.కూటమి ఏర్పడిన అనంతరం దాచేపల్లి ఎంఈవో 1 బదిలీపై వచ్చిన కాంతారావు శనివారం రాత్రి బాపట్ల జిల్లా అద్దంకిలో గుండె పోటుకు గురైనట్లు కుటుం బ సభ్యులు తెలిపారు.పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేటకు చెందిన కాంతారావు విజయపురి సౌత్ బాలుర జెడ్పీ హైస్కూల్లో ప్రధానోపా ధ్యాయులుగా విధులు నిర్వహిస్తు వెల్దుర్తి, మాచర్ల, రెంటచింతల, గురజాల, దాచేపల్లి మండలాలకు ఇన్చార్జి ఎంఈవో 1గా విధులు నిర్వహిస్తున్నారు.ఎంఇవో మృతి పట్ల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తమ సంతాపం వ్యక్తం చేసింది.యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వట్టెపు నాగేశ్వరరావు మాట్లాడుతూ దాచేపల్లి ఎంఈవో 1గా గత 5 నెలలుగా విధులు నిర్వహిస్తున్న కాంతారావు విధులు పట్ల అంకితభావం తో పనిచేశారని, ఐదు మండలాలకు ఇన్చార్జిగా విధులు నిర్వహిస్తు సమ న్వయం చేసుకుంటూ మంచి అధికారిగా పేరు సంపాదించా రన్నారు. ఆయన హఠాన్మరణం చెందటం భాధాకరమన్నారు. సంతాపం తెలిపిన వారిలో మండల శాఖ గౌరవ అధ్యక్షులు నాగేంద్ర యేషయ్య, అధ్యక్షులు రాజారావు, ప్రధాన కార్యదర్శి తగరం ఆనంద్ కుమార్ ఉన్నారు.

# స్వామివార్లకు ధనుర్మాస ప్రత్యేక పూజలు

**రెంటాల శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు అందుకున్న స్వామివార్లు**

**రెంటచింతల వేణుగోపాలస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు అందుకున్న స్వామివార్లు.**



**రెంటచింతల, డిసెంబర్ 30(ఆంధ్రపత్రిక):** మండలం లోని వివిధ గ్రామాలలోని పలు దేవస్థానాలలో ధనుర్మాసం సందర్భంగా చివరి రోజు శనివారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.రెంటాల గ్రామంలో వేంచేసిన శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు పూరిమెట్ల శేషభట్టాచార్యులు, స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులు, తుమ్మకోట గ్రామంలోని శ్రీ జనార్దనస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు నేతృత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నగర సంకీర్తన, గోదాదేవి పాసురాలు, గీతాపారాయణం నిర్వహించారు. స్వామివార్లను పలురకాల పూలతో అలంకరించారు. ధనుర్మాసంలో దీపారాధన చేయడం వలన ఇహలోకంలో సర్వ సంపదలు, పరలోకంలో మోక్షప్రాప్తి లభిస్తాయన్నారు. వేకువ జాము నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులను చెల్లించుకుని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. దేవస్థానం చైర్మన్లు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



– షెడ్యూల్ కులాల వర్గీకరణ ఏక సభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ

## కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న
# యూనియన్ నాయకులు



**మంగళగిరి, డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):** పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని కమిషనర్‌కు వినతి ప్రజాశక్తి మంగళగిరి క్లాప్ ఆటో డ్రైవర్ల పెండింగ్ జీతాలు, ఇతర సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ క్లాప్ ఆటో డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్ ఆలిం భాషకు వినతిపత్రం అందజేశారు. గత రెండు నెలల నుండి వేతనాలు చెల్లించకపోవడంతో క్లాప్ ఆటో డ్రైవర్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. అదే విధంగా వీరికి పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ఆప్కాస్‌లో చేర్చి ప్రతినెలా వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు జెవి.రాఘవులు, సిఐటియు నాయకులు బి.వెంకటేశ్వరరావు, యూనియన్ నాయకులు డి.శివ, పి.శ్రీనివాసరావు, టి.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 3న మహిళా ఉపాధ్యాయ దినోత్సవం
# నిర్వహించాలి

**వినతి పత్రాన్ని అందచేస్తున్న నారాయణపురం శ్రీనివాసరావు**



**రెంటచింతల,డిసెంబర్ 30(ఆంధ్రపత్రిక):** భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిభాయి పూలే జయంతి గౌరవార్ధం జనవరి 3వ తేదీన మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించాలని కన్నెగంటి హనుమంతు పౌండేషన్ అధ్యక్షులు నారాయణపురం శ్రీనివాసరావు సోమవారం ఎంఈఓ-2 వై.శివ నాగేశ్వర రావుకు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస రావు మాట్లాడుతూ సావిత్రి భాయి పూలే జయంతి సందర్భంగా 2018 సం.లో అప్పటి ప్రభుత్వం జనవరి 3వ తేదీన ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించిందని కరోనా కారణంగా కొన్ని సంవత్సరాలుగా వాయిదా వేయడం జరిగిందన్నారు. ఈ మంచి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలలో ఉత్తమ మహిళా ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారిని ఘనంగా సన్మానించి సముచితంగా గౌరవించాలని ఆయన కోరారు. ఈ విషయం జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని ఎంఈఓ శివ నాగేశ్వరరావు తెలిపారు.

## "స్థానికంగా తిరిగే సమయంలోను
# హెల్మెట్ తప్పనిసరి

**పట్టణ సీఐ వినోద్ కుమార్**



**మంగళగిరి, డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):** మంగళగిరి స్థానికంగా ద్విచక్ర వాహనాలపై తిరిగే సమయంలోను హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని మంగళగిరి పట్టణ సీఐ వినోద్ కుమార్ తెలిపారు. జాతీయ రహదారిపై ప్రయాణించేటప్పుడు మాత్రమే హెల్మెట్లు ధరించాలంటూ వస్తున్న ప్రచారంపై ఆయన సోమవారం స్పందించారు. ఇంటి నుంచి బయటకు వెళ్తే ఏదైనా దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగితే దెబ్బలు తగలవా అని వ్యాఖ్యానించారు. లోకల్‌లో అయినా, నాన్ లోకల్‌లో అయినా తిరిగేటప్పుడు హెల్మెట్ ధరించటం విధిగా అలవర్చుకోవాలని ఆయన తెలిపారు.

## విద్యుత్ కాంతుల్లో రాజుపాలెం
## శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయం



**రాజుపాలెం,డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):** ఆంగ్ల నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మండల కేంద్రమైన రాజుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న భక్తుల కోరికలతీర్చే శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానమును విద్యుత్ వెలుగులతో అత్యంత సుందరంగా సోమవారం తీర్చిదిద్దారు. 2025 జనవరి 1వ తేదీన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పోత్తూరి వెంకటరమ సుబ్బారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు. నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా ఆలయ సభ్యులు కోరారు.

## పెన్షనర్లకు ఉచిత కంటి
# వైద్య శిబిరం



**గురజాల, డిసెంబర్ 30(ఆంధ్రపత్రిక):** గురజాల పట్టణం లోని స్థానిక పెన్షనర్ భవన్‌లో సోమవారం పెన్షనర్ డే సందర్భంగా పెన్షనర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా పెన్షనర్ అసోసియేషన్ అధ్యక్షులు చిట్టెం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వయస్సు రీత్యా వచ్చు కంటి ఇబ్బంధులను గుర్తించటం కోసం ఈ శిబిరం నిర్వహించడం జరిగింది అన్నారు. డాక్టర్ రామలింగారెడ్డి మాక్స్ విజన్ హాస్పిటల్ వారి సహకారం ద్వారా వారి వైద్య సిబ్బంది కంటి పరీక్షలు చేశారు అని అన్నారు. వారితో పాటు రక్త పరీక్షలు కోసం టెక్నీషియన్ తోట వెంకట్రావు (వెంకట రమణ ఎక్సరే మరియు ల్యాబ్, గురజాల)సహకారం అందించారు అని అన్నారు. మొత్తం 95 మందికి కంటి పరీక్షలతో పాటు షుగర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారిని మెరుగైన వైద్యం నిమిత్తం రామలింగారెడ్డి హాస్పిటల్‌కి రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## మున్సిపల్ నీరు వచ్చే
## పైపులను సరిచేయరూ...



**గురజాల, 30 (ఆంధ్రపత్రిక):** నిత్యం మున్సిపాలిటీ నీరు వచ్చే పైపులని బాగు చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు. గురజాల పట్టణంలోని నాంది వాటర్ ప్లాంట్ ఎదురు ముస్లిం బజార్‌లో గల మున్సిపల్ వాటర్ వచ్చే పైపులు అక్కడక్కడ మురుగు కాలువలో నుండి కనెక్ట్ చేయబడింది. దానితో పాటుగా అక్కడ క్కడ పైపు నుండి వాటర్ లీకేజ్ వస్తుంది. లీకేజ్ వాటర్ పైపు మురుగు కాలువలో నీటితో కలిస్తే డవేరియా ప్రభలే అవకాశం వుంది. కావున ఆ మురుగు నీళ్ల నుండి కనెక్ట్ అయ్యి వున్న వాటర్ పైపును సరిచేయాలనీ ఆ ప్రాంత వాసులు కోరుకుంటున్నారు.

## శ్రీ రాజీవ్ రంజనుకు వినతి పత్రాన్ని అందజేసిన
## మహాజన సోషలిస్టు పార్టీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గడ్డిపర్తి శ్రీనివాసరావు



**రెంటచింతల, డిసెంబర్ 30(ఆంధ్రపత్రిక):** ఎస్సీ వర్గీకరణ చేయడం వలన దేశంలోని 58 మాదిగ ఉపకులాలకు మేలు జరుగుతుందని మహాజన సోషలిస్టు పార్టీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు, మాచర్ల నియోజకవర్గ ఇన్చార్జి గడ్డిపర్తి శ్రీనివాసరావు సోమవారం సీఎం చంద్రబాబు నియమించిన ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజను వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మహాజన నేత మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్‌కు వినతి పత్రాన్ని అందచేయడం జరిగిందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయని కారణంగా గత 70 సంవత్సరాలుగా 58 మాదిగ ఉపకులాల వారు విద్య, ఉద్యోగ, రాజకీయ, సంక్షేమ రంగాలలో తీవ్రంగా నష్టపోతున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి రిజర్వేషన్ పేరుతో ఒక వర్గం వారే వారి జనాభా కన్నా ఎక్కువ లబ్ధి పొందారన్నారు. ఉమ్మడి ఏపిలో ఏర్పాటు చేసిన అనేక కమిషన్లు, దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాలలో నియమించిన కమిషన్లు ఎస్సీ వర్గీకరణ చేయకపోవడం వలన ఈ 58 కులాల వారికి ఏ విధంగా అన్యాయం జరిగిందో గణాంకాలతో సహా నివేదికలు ఇచ్చియని గుర్తు చేశారు. ఈ ఏడాది ఆగష్టు 1న ఎస్సీ వర్గీకరణ న్యాయమైందని భారత అత్యున్నత న్యాస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించి దేశంలో ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఆయన కోరారు. ఆయన వెంట ఎంఆర్పీస్ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కందుకూరి రమేష్, ఎంఎస్పీ, ఎంఆర్పీస్ నాయకులు టి.మరియబాబు మాదిగ, టి.జీవరత్నం మాదిగ, పి.అన్నారావు మాదిగ, యు. మార్క్ మాదిగ, రూబెన్ మాదిగ తదితరులున్నారు.

# నూతన సంవత్సర వేడుకలు జరుపుకునే వారు
# జాగ్రత్తలు పాటించాలి

**సర్కిల్ ఇన్స్పెక్టర్ టీవీ శ్రీనివాస్ రావు**
**వేడుకల పేరుతో ప్రజా జీవనానికి భంగం కలిగిస్తే**
**చట్టపరమైన చర్యలు**
**ఆన్లైన్ లావాదేవీలపై జాగ్రత్తగా ఉండాలి**



**కారంపూడి,డిసెంబర్30(ఆంధ్రపత్రిక):**నూతన సంవత్సర వేడుకలు నిర్వహించు కునే వారు జాగ్రత్తలు పాటించాలి, ప్రమాదాలకు దూరంగా ఉంటూ పిల్లలు పెద్ద లు అందరూ వారి ఇండ్లలో ఉత్సవాలు జరుపుకోవాలి,పోలీసు వారి సూచనలు పాటించాలని సోమవారం కారంపూడి మండల సర్కిల్ ఇన్స్పెక్టర్ టీవీ శ్రీనివాస్ రావు ప్రజలకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ తరుపున భద్రత ఏర్పాట్లు చేయడం జరిగినది అని తెలిపారు. డిసెం బర్ 31 రాత్రి వేడుకలు, నిర్వహించుకునే నూతన సంవత్సర వేడుకల సందర్భ ంగా పోలీస్ యంత్రాంగం మొత్తం ముఖ్యంగా పటిష్టమైన బందోబస్త్, నిత్యం పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుంది. పట్టణ, గ్రామీణా ప్రాంతాల్లోను డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహించబడుతాయని. అలాగే ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తే వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పోలీసు సూచనలు నిబంధనలు:నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసుకునే కార్యక్ర మాలు తొందర్లోనే వరకు పూర్తి కావాలి. తర్వాత కొనసాగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం అని అన్నారు. పిల్లల పట్ల జాగ్రత్తలు పాటించాలి, మైనర్స్కు వాహనాలు ఇవ్వవద్దు. టపాసులు, డీజేలు నిషేధం.మద్యం మత్తులో వాహనాలు నడపడం నేరం, వాహనాలు వేగంగా నడపవ ద్దు. అని హెచ్చరించారు. రహదారులు బ్లాక్ చేసి ఉత్సవాలు చేయవ ద్దు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించేవద్దు. ఇతరులకు ఇబ్బం ది కలిగించవద్దు. ఇల్లు, ప్రైవేట్ ఆస్తులపై, వీధి దీపాలపై రాళ్ళు వేయడం, అద్దాలను పగలగొట్టడం నేరం అని అన్నారు.ర్యాష్ డ్రైవిం గ్, బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్లను తీసివేసి వాహనాలు నడపడం, శబ్ద కాలుష్యం చేస్తూ ఇతరులను ఇబ్బంది పెడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.న్యూ ఇయర్ వేడుకలలో నిషేధిత డ్రగ్స్, గాంజా వంటి మత్తు పదార్థాలు విక్రయించిన, వినియోగించిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.మద్యం దుకాణాలను నిర్ణీత సమయంలో క్లోజ్ చేయాలి, మైనర్లకు మద్యం అమ్మకూడదు.బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే కేసులు పెడుతాం.మైనర్లు వాహనాలు వాహనాలు ఇవ్వవద్దు.ఈ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసే ఎలాంటి కార్యక్రమాలు అయన సరే నిర్వాహకులు తప్పని సరిగా పోలీసు అధికారుల నుండి ముందస్తు అనుమతులు తీసుకోవాలి.న్యూ ఇయర్ ఆఫర్ల పేరిట సైబర్ నేరగాళ్లు ఆర్థిక నష్టం కలిగించే అవకాశం ఉన్నది కావున ఆన్లైన్ నందు, అపరిచితులతో వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ అకౌంట్ వివరాలు, పిన్ నబర్లు ఇవ్వవద్దు.అంక్షలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు అని సీఐ హెచ్చరించారు. అత్యవసర సమయంలో ప్రజలు స్థానిక పోలీసు అధికారులకు, లేదా డయల్ 100 కు ఫోన్ చేసి పోలీసు సేవలు ఉపయోగించుకోవాలని కోరారు.



## కులగణన కమీషన్ ఛైర్మన్ను కలిసిన మాదిగదాసు నాయకులు

**సత్తెనపల్లి, డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):**రాష్ట్రంలో కులగణన కోసం ఏపీ ప్రభుత్వం నియమించిన కమీషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాను ప్రగతి మాదిగదాసు సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు అంకాళ్ళ నాగరాజు, కార్యవర్గ సభ్యులు సోమవారం గుంటూరు కలెక్టర్ కార్యాల యంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు తాము అనుకూలమని ఈ వర్గీకరణ ఫలాలు తాము పొందాలంటే కుల ధ్రువీకరణ సమస్యపరిష్కారం కావాలి అన్నారు. గత మూడున్నర దశాబ్దాలు కులధ్రువీకరణ సమస్య మా అభివృద్ధికి తీవ్ర విఘాతంగా మారింది అన్నారు. ఆర్డీవో ఇవ్వాలనే నిబంధన తమ భవిష్యత్తు అఘాతంలోకి నెట్టివేసింది అన్నారు.కుల సమస్య కారణంగా అనేక ప్రాంతాలలో మాదిగగా కులధ్రువీకరణ తీసుకోవడంతో మాదిగ దాసు కులం ప్రశ్నార్ధకం అయ్యింది అన్నారు. 2019 ప్రభుత్వం జీవో 58 ద్వారా కుల సవరణ చేసి తహసీల్దార్ ఇవ్వాలనే జీవో ఉన్నప్పటికీ అధికారులు జీవోను అమలుచేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తు న్నారు అన్నారు. కులగణన ద్వారా జరిగిన పొరపాట్లను సరిచేసు కోవటంతో పాటు జీవో 58ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం అమలు చేసే లా కృషి చేయాలని కమీషన్ ను కోరినట్లు ఆయన తెలిపారు. కమీషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా, కలెక్టర్ నాగలక్ష్మిలు సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తిరుపతి నరేంద్రనాథ్, అంకాళ్ళ ప్రవీణ్, అంకాళ్ళ సాయిచంద్, నర్రా సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు

**గుంటూరు డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):**గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగర పాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పిజిఆర్ఎస్లో ప్రజలు ఇస్తున్న అర్జీలుర్ ఓపెన్ కాకుండా సమగ్రంగా పరిశీలించి, శాశ్వత పరిష్కా రానికి చర్యలు తీసుకోవాలని గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులే సు స్పష్టం చేశారు. నగర కమిషనర్ పులి శ్రీనివా సులు ఐఏఎ స్ ఆదేశాల మేరకు సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పిజిఆర్ఎస్ నిర్వహించారు. ఈ సంద ర్భంగా అదనపు కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుండి అందిన 23 ఫిర్యాదు లు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుండి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలి గినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి



వేరువేరుగా లిస్టు తయారు చేయాలన్నారు. డయల్ యువర్ కమిషనర్కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాల న్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు తీసుకొని అధికారులతో మాట్లాడుతూ పిజిఆర్ఎస్లో ప్రజలు ఇస్తున్న ఆర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు ఆర్జీలను నేరుగా వెళ్లి పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యలను స్థానికంగానే పరిష్కారం చేయడానికి సచివాలయ కార్యదర్శులు భాధ్యత వహించాలన్నారు. అర్జీలు, ఫిర్యాదుల నమోదుకి ప్రతి విభాగంలో ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పా టు చేయాలన్నారు. పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు.సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్కు 34 ఫిర్యాదులు అందా యని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 14, ఇంజినీ రింగ్ విభాగం 5,రెవెన్యూ విభాగం 3, ప్రజారోగ్య విభాగం 9, అకౌంట్స్ విభాగంకి సంబంధించి 3 ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్ర మంలో డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, డిసిపి సూరజ్ కుమార్, మేనేజర్ బాలాజీ బాష తదితరులు పాల్గొన్నారు.



# సావిత్రిబాయి పూలే జయంతి వారోత్సవాలు

**సత్తెనపల్లి, డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):**ముప్పాళ్ళ మండలం గోళ్ళపా డు కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం నందు హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వారోత్సవాలు ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర సిఎస్ఐ కోర్టు సీనియర్ సూపరెంటెంట్ పివిపి అంజనీకుమారి విచ్చేసి మాట్లా డుతూ ఆ రోజుల్లోనే బాలికలు మహిళలు చదువుకోవాలి అనే దృఢ సంకల్పంతో బాలికల,మహిళల విద్య కోసం ఎన్నో పోరాటాలు ఎంతో సంకల్పంతో ముందుకు సావిత్రిబాయి పూలే తీసుకువెళ్లారని పేర్కొ న్నారు. ఈరోజు ఈ విధంగా ఎంతోమంది ఆడపిల్లలు విద్యావంతులు అవుతున్నారని, మన ఆలోచనా విధానమే మన భవిష్యత్తుకు పునాది అని,ఆడపిల్లలు మానసికంగా సానుకూల దృక్పథంతో దృఢంగా ఉన్నప్పుడే ఎలాంటి సమస్యనైనా అధికమించగలమని, కావున ప్రతి ఒక్క విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలన్నారు. ముం దుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పిం చడం జరిగింది. పాఠశాల ప్రిన్సిపల్ ఝాన్సీ సహ్రులత అధ్యక్షత వహిం చారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లి బాబు మాట్లాడుతూ ఆడపిల్లల్లో గట్టి పట్టుదల సంకల్పం ఉంటాయని దేనినై నా సాధించేటువంటి సంకల్పబలంఆడపిల్లల్లో ఎక్కువగా ఉంటుంద న్నారు.అనంతరం 6,7,8,9,10, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరములో ప్రతిభ సాధించిన విద్యార్థులకు పివిపి అంజనీ కుమారి ఆర్థిక సహకారంతో రగ్గులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీచర్ మస్తాన్ ఐటిఐ ప్రిన్సిపల్ రమేష్, హెల్ప్ ఫౌండే షన్ కో–ఆర్డినేటర్ శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అనంతపురం పోలీసుల అనుచిత ప్రవర్తనతో...
# శేషాద్రి గుండెపోటుతో మరణించారు

**సత్తెనపల్లి,డిసెంబర్ 30(ఆంధ్రపత్రిక):** అనంతపురం పోలీసుల అనుచిత ప్రవర్తనతో పోలీస్ స్టేషన్లోనే సీనియర్ న్యాయవాది శేషాద్రి గుండెపోటుతో మరణించారని, దానికి కారకులైన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, జ్యుడీషియల్ విచారణ కు ఆదేశించాలని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంబాల అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపులో భాగంగా సోమవారం సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంబాల అనిల్ కుమార్, వారి కార్యవర్గం నిర్ణయం మేరకు సత్తెనపల్లిలో ఉన్న నాలుగు న్యాయస్థానాల్లో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ముందుగా అందరు న్యాయదేవత వద్దకు చేరుకొని నినాదాలు చేస్తూ తమ యొక్క నిరశ నను తెలిపారు. అనంతపురం బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది బి.వి శేషాద్రి అక్కడ ఉన్న



మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్కు తన క్లయిం ట్ తరుపున ఒక కేసును డీల్ చేస్తున్నారు... మీకు చట్టపరంగా ఆ హక్కు లేదని క్లయింట్ తరుపున నోటీసు పంపారు. ఆ అక్కసుతో సదరు సి.ఐ పదే, పదే న్యాయవాదిని స్టేషన్ పిలవగా ఆ న్యాయవాది తన జూనియర్ న్యాయవదులతో కలసి స్టేషన్ కు వెళ్ళగా సదరు సి.ఐ జూనియర్ న్యాయ వాదులకు లోపలకి అనుమతించకుండా కేవలం శేషాద్రి నే అనుమతించి తన ఛాంబర్ లోకి సెల్ ఫోన్ కూడా అనుమతించకుండా ఆ న్యాయవాదిని

**న్యాయవాదుల ఆవేదన..**

విచారణ పేరుతో గట్టిగా మాట్లాడటంతో అక్కడే న్యాయవాది శేషాద్రి గుండెపోటుతో మరణించారని దుయ్యబట్టారు. కనీసం మానవత్వం కూడా చూపకుండా సదరు సి.ఐ జూనియర్ న్యాయాదులను పిలిచి మీ సీనియర్కు ఫిట్స్ వచ్చాయని అక్కడ నుంచి తరలించగా అప్పటికే మరణించారని వైద్యులు తెలిపారన్నారు. ఈ సంఘటనకు కారకులైన పోలీసు లపై కఠిన చర్యలు తీసుకోవాలని, న్యాయవాదుల పరిరక్షణ చట్టంను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు తేవాలి అని న్యాయవాదులు డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పిన్నమనేని పాములు య్య, చిలుక చంద్రశేఖర్, పూజల వెంకట కోటయ్య, అనుమోలు జయరాం, బి.ఎల్ చిన్నయ్య, దివ్వెల శ్రీనివాసరావు, కన్నెధార హనుమయ్య, కొల్లా వెంకటే శ్వరరావు, రాజశేఖరుని గోపాలకృష్ణమూర్తి, మద్దినేని వెంకట చలపతి రావు, కాకర్ల హరిబాబు, రాజవరపు నరసింహారావు, మన్నెం వెంకటేశ్వరరావు, తవ్వా హరనాథ్, సూరే వీరయ్య, నరిశేటి వేణుగోపాల్, జూపల్లి శేషయ్య, బాదినేడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# నేడే పింఛన్ల పంపిణీ

**నాదెండ్ల డిసెంబర్ 30(ఆంధ్రపత్రిక):**మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 31వ తేదీ మంగళవారం అన్ని రకాల పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో ఎస్.స్వరూపారని తెలిపారు. జనవరి ఒకటో తేదీ నూతన సంవత్సరం వేడుకలు సందర్భంగా ఒకరోజు ముందుగానే ప్రభుత్వం పింఛన్లు పంపిణీ చేసేందుకు అనుమతి ఇచ్చింది అన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది మంగళవారం ఉదయం ఐదు గంటల నుండి లబ్ధిదారుల ఎల్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందజేస్తారని మండలంలో 9,458 మందికి 4,11,4,500/-పంపిణీ చేయనున్నట్లు ఎవరైనా మంగళవారం పింఛన్లు తీసుకోవడానికి అందుబాటులో లేకపోతే మూడవ తేదీ గురువారం పింఛన్ తీసుకోవచ్చని స్వరూపారని తెలిపారు.

# దీర్ఘకాలంగా ఒకే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ఇన్స్పెక్టర్లను డివిజన్ల మార్పు



**గుంటూరు, డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో శానిటరీ డివిజన్లను 22 నుండి 32కి పెంపు చేసి, దీర్ఘకాలంగా ఒకే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నఇన్స్పెక్టర్లను కూడా డివిజన్ల మార్పు చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పెరిగిన గుంటూరు నగర పరిధి దృష్ట్యా, మెరుగైన పారిశుధ్య పనులు చేపట్టడానికి వీలుగా ప్రస్తుతం ఉన్న 22 శానిటరీ డివిజన్లను 32 డివిజన్లుగా పెంపు చేశామన్నారు. అలాగే దీర్ఘ కాలంగా ఒకే డివిజన్లో విధులు నిర్వహిస్తున్న శానిటరీ ఇన్స్పెక్టర్లను కూడా బదిలీ చేశామని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ, సుందర నగరంగా గుంటూరుని పరిరక్షించడంలో ప్రజారోగ్య విభాగం కీలకమని, అటువంటి ప్రాధాన్యత విభాగంలో విధులు నిర్వహించే కార్యదర్శులు, ఇన్స్పెక్టర్లు భాధ్యతగా ఉండాలన్నారు. తమకు కేటాయించిన ప్రాంతాల్లో నూరు శాతం పారి శుధ్య పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. శానిటరీ సూపర్వైజర్లు ఇన్స్పెక్టర్లు, కార్యదర్శుల పనితీ రు, హాజరుని క్షేత్ర స్థాయిలో పర్య వేక్షణ చేయాలని, ఇప్పటికే ఇతర విధుల్లో ఉన్న కార్మికులను తిరిగి పారి శుధ్య పను లకు కేటాయించా మని, డివిజన్ల పరిధి తగ్గించి నందున ప్రతి ఒక్కరూ అంకిత భావంతో విధు లు నిర్వహించాలని, నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

## పుల్లారావు ఎస్ఐ



**నాదెండ్ల, డిసెంబర్ 30(ఆంధ్రపత్రిక):** నూతన సంవత్సర వేడుకలను ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై జి. పుల్లారావు అన్నారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్లో సోమవారం పుల్లారావు మాట్లాడుతూ 31వ తేదీ అర్ధరాత్రి నుండి 2వ తేదీ ఉదయం వరకు మండలంలో పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుంది అన్నారు. నూతన సంవత్సరం వేడుక లు సందర్భంగా మద్యం సేవించి మద్యం మత్తులో అల్లర్లకు పాల్ప డితే చట్ట ప్రకారం అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు తీసివేసి పెద్ద శబ్దాలతో గ్రామాల్లో వీధుల వెంట కేరింతల కొట్టరాదు అన్నారు. నూతన సంవత్సర సందర్భంగా వీధుల వెంట గుంపులు గుంపులుగా తిరగరాదు అన్నారు. హద్దు మీరు ప్రవర్తిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు అన్నారు. వీధుల గంట బాణసంచాలు కాల్చరాదు అన్నారు. నూతన సంవత్సర సందర్భంగా ప్రతి ఒక్కరూ సమన్వయం పాటించాలి అన్నారు. ముందు జాగ్రత్తగా భాగంగా అన్ని గ్రామాల్లో పోలీస్ పహారా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు ముందస్తు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

# వేప కషాయం తయారుపై రైతులకు అవగాహన



**నాదెండ్ల డిసెంబర్ 30(ఆంధ్రపత్రిక):**మండలంలోని సాతులూరు గ్రామంలో గ్రామీణ వ్యవసాయ కృషి, అనుభవ కార్యక్రమంలో భాగంగా సోమవారం బాపట్ల వ్యవసాయ కళాశాల శిక్షణ విద్యార్థులు గ్రామ రైతులకు వేప కషాయం తయారు విధానం గురించి అవగాహన కల్పించారు. అందులో భాగంగా వేప విత్తనాలకు బదులుగా వేపాకులను ఉపయోగించి, వేప కషాయం తయారు విధానం గురించి అవగాహన కల్పించారు. ఈ కషాయాన్ని సాయంత్రం వేళలో పిచికారి చేయడం వల్ల వివిధ చీడ పీడల యొక్క గుడ్లను లద్ద పురుగుల దశలను నివారించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# నల్ల బ్యాడ్జీలతో నిరసన..



**తెనాలి, డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):** తెనాలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యములో న్యాయవాదులు సోమవారం విధులను బాయకాట్ చేశారు. కోర్ట్ ఎదుట నల్ల బ్యాడ్ జీలతోనిరసన వ్యక్తం చేశారు. అనంత పురంల్లో 3టౌన్ పోలీసుల వేధింపులకారనముగా న్యాయవాది శేషాద్రి గుండెపోటుతో మరనింఛాడని, అలాగే అక్కిరెడ్డి పల్లెలో సీ.ఐ. కొండారెడ్డి, సుదర్శన్ అనే న్యాయవాదిపై చేయిచేసుకున్నందుకు నీరసనగా విధులను భష్కరిస్తునట్లున్యాయవాదులు తెలిపారు. బాధ్యులపై చేర్యాలుతీసుకోవాలని డిమాండ్ చేశారు.

# వర్ధమాన సినీ కళాకారుడు చెన్నకేశవకు సత్కారం..



**సత్తెనపల్లి,డిసెంబర్ 30(ఆంధ్రపత్రిక):**సత్తెనపల్లి పట్టణానికి చెందిన వర్ధమాన సినీ కళాకారుడు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి నియోజకవర్గ కార్యదర్శి చెన్నకేశవను కళల కాణాచి అయిన తెనాలి పట్టణంలోని కళాక్షేత్రంలో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి వేడుకల్లో భాగంగా భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు, స్వాతంత్ర సమరయోధులు, కళాకా రులు అమరజీవి లోకం వెంకటేశ్వరరావు సమా జానికి చేసిన వెలకట్టలేని సేవలను, గత స్మృతులను వివిధ సంఘాల ప్రముఖులు వివరించారు. కళాకారులు, కమ్యూనిస్టు పార్టీ నాయకులు లోకం వెంకటే శ్వరరావు తనయుడు కమ్యూనిస్టు పార్టీ నాయకులు లోకం భాస్కరరావు తన కుటుంబ సమేతంగా విచ్చేసి ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవ మాట్లాడుతూ తనను ఈ మహత్తర కార్యక్రమానికి ఆహ్వానించి కుటుంబ సమేతంగా ప్రేమతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేసిన లోకం భాస్కరరావుకి, వారి కుటుంబానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకున్నారు.

# టేబుల్ టెన్నిస్‌లో జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన హాసిని



**గుంటూరు, డిసెంబర్ 30(ఆంధ్రపత్రిక):**టేబుల్ టెన్నిస్‌లో జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన హాసిని చదువులోను ముందుంటూ ఆదర్శంగా నిలుస్తుందని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ గారు అన్నారు. నగరపాలక సంస్థ ఎన్టీఆర్ స్టేడియంలో టేబుల్ టెన్నిస్‌లో శిక్షణ పొంది రాష్ట్ర స్థాయిలో అండర్-19, అండర్-17, ఉమెన్స్ విభాగాల్లో ప్రతిభచాటి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పి.హాసినిని సోమవారం కమిషనర్ గారు తమ క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేకంగా శాలువా కప్పి అభినందించారు.

# జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్ ప్యాకెట్ల పంపిణీ



**చిలకలూరిపేటటౌన్, డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):**శ్రీ దత్త సాయి అన్నదాన సమాజం మరియు జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో షిరిడీలో అన్నదాన సత్రం నిర్వహిస్తూన్న నిత్యాన్నదాత దత్త సాయిరాం అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మద్ది రమేష్ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని 28వ వార్డు రాగన్నపాలెంలోని మున్సిపల్ ప్రైమరీ స్కూల్లో విద్యార్థులందరికీ పుస్తకాలు పెన్నులు బిస్కెట్ ప్యాకెట్లు జయ జయ సాయి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పూసపాటి బాలాజీపంపిణీ చేశారు, ఆయన మాట్లాడుతూ షిరిడీలో నిత్య అన్నదానం నిర్వహిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలుకి ఆర్దిక సహకారం అందిస్తూ అభివృద్ధి పయనంలో ప్రయాణిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్న రమేష్ ఆయురారోగ్య భోగభాగ్యాలతో ఉండాలని కోరారు, ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ దేవరకొండ నాగేశ్వరావు, మస్తాన్ వలి, కొనికి సాంబశివరావు, బండారు వీరయ్య తదితరులు పాల్గొనీ శుభాకాంక్షలు తెలియజేశారు.

# దాతల సహకారంతోనే దేవాలయం నిర్మాణం



**నాదెండ్ల,డిసెంబర్ 30(ఆంధ్రపత్రిక):**గ్రామస్తులు, దాతల సహకారంతోనే అమ్మవారి దేవాలయం నిర్మిస్తున్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్ సభ్యులు అన్నారు. మండలంలోని సాతులూరు శ్రీ రెడ్డి పేరంటాలమ్మ తల్లి దేవాలయం నూతన నిర్మాణం కొరకు గుంటూరుకు చెందిన జెట్టి ఉమా శంకర రావు సతీమణి పావని కుటుంబ సభ్యుల సహకారంతో దేవాలయం వద్ద సోమవారం 5,01,116/- రూపాయలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ ఉమా శంకర్రావు కుటుంబ సభ్యులను అభినందించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ దేవస్థానం శిథిలావస్థకు చేరటంతో దాన్ని తొలగించి అదే స్థానంలో నూతన నిర్మాణం చేపట్టామన్నారు సుమారు రెండు కోట్ల రూపాయలు ఖర్చుతో నూతన హంగులతో దేవాలయం నిర్మాణం పూర్తికా వచ్చింది అన్నారు. మార్చి 17వ తేదీ దేవాలయం ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. దాతలు, గ్రామస్తులు పూర్తి సహకారం అందించడంతోనే దేవాలయం నిర్మాణం వేగవంతంగా పూర్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ వజ్జా వీరాంజనేయులు, కమిటీ సభ్యులు జంపని లక్ష్మీనారాయణ,వజ్జ రామారావు, చెన్నబోయిన వెంకట సుబ్బారావు, కమ్మ సీతయ్య, వజ్జ శ్రీనివాసరావు, వజ్జ వెంకట్రావు, గొర్రె సాంబశివరావు,నర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## తెనాలి తహశీల్‌దార్

# గ్రీవెన్స్‌కు ఒక ఆర్జీ



**తెనాలి డిసెంబర్ 30(ఆంధ్రపత్రిక):**తెనాలి కొత్తపేటలోని తహశీల్దార్ కార్యాలయములో సోమవారం నిర్వహించిన పీజీర్ గ్రీవన్స్కు ఒక్క ఆర్జీవీ వచ్చినట్లు తహసీల్దార్ కె వి.గోపాలకృష్ణ తెలిపారు. చెంచుపేట అమరావతీ కాలనీలో ఈ ఆర్జీవచ్చినట్లు తెలిపారు. సంబంధిత విభాగానికి పంపించీ ఈ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. తెనాలి మండలములో జరుగుతున్న రెవెన్యూ సదస్సు లల్లో పాల్గొని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కోరారు.

# "రక్త దానంపై అపోహలు "పెట్టుకోవద్దు



**తెనాలి,డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):**రక్తదానంపై అపోహలు పెట్టుకోవద్దని, ఆపదస మయములో అందించే రక్తం భాధితుల ప్రాణాలను కాపాడుతుందని గత 40ఏళ్లలో 100 సార్లు రక్తదానం చేసిన గుంటూరికి చెందిన పోలీరెడ్డి ఉమామహేశ్వరరావు అన్నారు. తెనాలి ఏ. ఎస్. ఎన్ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛందసేవ సంస్థమానవతా సర్వసభ్యాసమావేశం జరిగిందీ. రకదానం చేయటం వలన సేరీరక బలహీనం కేవలం అపోహ మాత్రమే ఐని, రక్తదానం చేయటమువళ్ళ మరింత ఆరోగ్యా వంతముగా మారతారని తెలిపారు.

# క్విజ్ పోటీలలో గణపవరం విద్యార్థులు ప్రతిభ



**నాదెండ్ల, డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):**మండలంలోని గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సిహెచ్. స్వాతిక, టి. జగన్మోహన్ రెడ్డి, కె.హిమ ఆదిత్య, సీనియర్స్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. మ్యాప్ పాయింటింగ్ సీనియర్స్ విభాగంలో ఎస్.కె. రాసిక్, మూడవ స్థానం బెస్ట్ ప్రేమ్, వెస్ట్ జూనియర్ విభాగంలో పి.కృపాకర్, టి.ప్రవీణ్, బి.శివ ప్రతి స్థానం సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం విజేతలను ప్రధాన ఉపాధ్యాయులు ఐ.కృష్ణా నాయక్, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు ఎన్.బాజీ బాబు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు కృష్ణా నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటే క్రీడల్లో కూడా రాణించినప్పుడే మంచి గుర్తింపు పొందుతారు అన్నారు.

# శాంతియుత వాతావరణంలో న్యూ ఇయర్ జరుపుకోవాలి

**- 31వ తేది రాత్రి 10 గం. నుండి స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తాము**

**- డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారిపై కేసు నమోదు చేసి బైయిండోవర్ చేయడం జరుగుతుంది**

**- పెదకూరపాడు ఎస్ఐ గిరిబాబు**

**పెదకూరపాడు, డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):** డిసెంబర్ 31న నిర్వహించుకునే వేడుకలు పెదకూరపాడు మండల ప్రజలు యువత శాంతి యుత వాతావరణంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణం జరుపుకోవాలని ఒక ప్రకటనలో పెదకూరపాడు ఎస్ఐ గిరిబాబు తెలిపారు. డిసెంబర్ 31 వేడుకలు నిర్వహించుకునే ప్రజలు ప్రమాదాలకు దూరంగా ఉంటూ పోలీసు వారి సూచనలు పాటించాలి, వేడుకలు నిర్వహించుకునే వారు ఇతరుల మనోభావాలు దెబ్బతినకుండా, ప్రమా దాలకు దూరంగా ఉంటూ నిర్వహించుకోవాలని అన్నారు. మద్యం దుకాణాలు, వైన్ షాప్స్ రాత్రి 12.00 గంటల వరకు ప్రభుత్వం అనుమతించిన సమయ పాలన పాటించాలి. 31వ తేది రాత్రి 10 గం. నుండి స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తాము. మద్యం సేవించి వాహనాలు నడిపితే అలాంటి వారిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తాము, అదేవి దంగా వాహనము సీజ్ చేయడం లైసెన్స్ రద్దు చేయడం మరియు బైయిండోవర్ లాంటి చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గంజా యి, డ్రగ్స్ ఇతర మాదకద్రవ్యాలు సేవించే వారిపై ఎప్పటికప్పుడు డ్రగ్స్ టెస్టింగ్ కిట్ల ద్వారా తనిఖీలు నిర్వహించడం జరుగుతుంది. ట్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండ వాహనం నడిపితే కూడా చట్ట పరమైన చర్యలు తప్పవు అన్నారు. మఫ్టీ టీమ్స్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది తో అక్రమ సిట్టిం గు లు, ఆరుబయట మద్యం సేవించడం, గుంపులు గుం పులుగా తిరుగుతూ మహిళలను వేదింపులకు గురి చేస్తూ, ఇబ్బందులను పెట్టే వారిపై షిటీం బృందా లు ఎప్పడికప్పుడు పర్యవేక్షణ చేయడం జరుగుతుంది. ఆర్కెస్ట్రా, డి.జేలు,



మైకులు ఉపయోగించడం, బాణ సంచా నిషేధం. నిబంధనలు అతిక్రమిస్తేచట్ట పరమైన చర్యలు తీసుకుంటాం అన్నారు. ముఖ్యంగా యువతపై కేసు నమోదు ఐతే భవిషత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు, ఇతర దేశాలకు వెళ్ళుటకు వీసాలు లాంటివి ఇవ్వబడవు, కావున యువత గమనించగలరు. మద్యానికి దూరంగా ఉండాలి. తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్త వహించాలి. వేడుకల్లో అపశృతులు జరగకుండా వాహన తనిఖీలు, పెట్రోలింగ్, పికేట్స్, మఫ్టీ టీమ్స్, ముఖ్యమైన కూడలిలలో కెమరాలు ఏర్పాటు లాంటి ముందస్తు చర్యలు తీసుకుంటున్నాము. పై సూచనలు పాటిస్తూ జిల్లా ప్రజలు మరియు యువత యొక్క అమూల్యమైన జీవితం ప్రమాదాల బారిన పడకుండా చూడడం పోలీస్ వారి బాధ్యత. ప్రజలు పోలీసు వారి సూచనలు పాటించాలని ఎస్ఐ గిరిబాబు కోరారు.

# మాజీ విద్యా శాఖ మంత్రి బొత్సకి మతి పోయినట్లు ఉంది

**మండల తెలుగుదేశం నాయకులు గమిడి పూర్ణయ్య**



**కారంపూడి, డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):** మాజీ మంత్రి బొత్సకి మతి పోయినట్లుగా మాట్లాడుతున్నారని,విద్యార్థుల కోసం ధర్నాలు చేస్తామని రోడ్లు ఎక్కుతామని అర్థమయ్యి అర్థం కాని మాటలతో రెచ్చిపోతున్నాడని చతురొక్తులతో కారంపూడి మండల తెలుగుదేశం నాయకులు గమిడి పూర్ణయ్య విమర్శించారు. విద్యుత్ చార్జీలు పెంచక మునుపే పెంచినట్లుగా ఊహించుకొని వారి ముఠా నాయకుడు జగన్ పిలుపు నివ్వటం, ఈ నాయకులంతా ఎగేసుకొని రోడ్లు ఎక్కటం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాము తలపెట్టిన నిరసన కార్యక్రమం జయప్రదం అయిందని గొప్పలు చెప్పుకుంటూ విద్యార్థుల సమస్యలపై ఉద్యమిస్తామంటూ ఊగదంపడు ప్రకటనలు చేస్తున్నాడని,అసలు గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలోనే అన్ని వ్యవస్థలతో పాటు విద్యావ్యవస్థ కూడా సర్వనాశనం అయిపోయిందని విమర్శించారు. పాఠశాలలలో మధ్యాహ్నం పెట్టే భోజన పథకంలో బియ్యం కూడా అమ్మకు తిన్న ఘన చరిత్ర గత ప్రభుత్వ నాయకుల దని అన్నారు. విద్యార్థుల మీద అంతా ప్రేమను వలక పోస్తున్న బొత్స, విద్యార్థుల విద్యానంతరం ఉద్యోగాలు లేక పిచ్చివాళ్ళలా బజార్ల వెంట తిరుగుతుంటే గత ప్రభుత్వంలో ఉన్న ఘనులు ఏం చేశారని ప్రశ్నించారు. అసలు వారు చెప్పే మాటలు వారి కుటుంబ సభ్యులకే అర్థం కాదు. అలాంటివారు విద్యార్థుల్ని ఉద్ధరిస్తాం, తొక్కి పాతరేస్తామని ప్రగల్బాలు పలుకుతున్నారని అన్నారు. అసలు మీరు విద్యాశాఖ మంత్రి అయిన రెండున్నర సంవత్సరాలలో విద్యాశాఖకు, విద్యార్థులకు ఏమి వరగపెట్టారో చెప్తారా అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన మా కూటమి ప్రభుత్వం ఆరు నెలల కాలంలోనే పెన్షన్లు ఒకటో తారీకు ఒక్క రోజులోనే అందరికీ అందిస్తున్నామని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించి పేద విద్యార్థులకు సహకారం అందిస్తున్నామని చెప్పారు. రాజధాని అమరావతిలో జంగిల్ క్లీనింగ్ చేయించి సంక్రాంతి పండక్కి అమరావతి పనులు మొదలు పెట్టబోతున్నామని, పోలవరాన్ని పరిగెత్తించబోతున్నామని చెప్పారు. చాతనైతే కూటమి ప్రభుత్వానికి సహకరించండి, లేకపోతే మీ వైసీపీ పార్టీని ప్రజలు మర్చిపోయే స్థితికి తెచ్చుకోవద్దని సలహా ఇచ్చారు.

# వైసీపీకి షాక్

(మొదటిపేజీ తరువాత)

జనసేనలో చేరారు. పవన్ కళ్యాణ్ వారికి పార్టీ కండువా వేసి జనసేనలోకి సాదరంగా ఆహ్వానించారు. గంజి చిరంజీవి గతంలో మంగళగిరి మున్సిపల్ చైర్మన్‌గా ఐదేళ్లపాటు కొనసాగారు. 2014 ఎన్నికల్లో టిడిపి తరఫున మంగళగిరి ఎమ్మెల్యేగా పోటీ చేసి 12 ఓట్ల తో ఓడిపోయారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ గానూ పని చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీలో చేరారు. వైసిపి మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జీగా పనిచేశారు. వైసీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడుగాను కొనసాగారు. గత ఎన్నికల్లో వైసిపి తరపున ఎమ్మెల్యే టికెట్ ఆశించినప్పటికీ మహిళకు కేటాయించడంతో అది సాధ్యపడలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో గంజి చిరంజీవి జనసేనలో చేరారు. వైసిపి నాయకులు గుండా మధు కూడా జనసేనలో చేరారు. ఏపీ మెడికల్ సర్వీసెస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జనసేన పార్టీ ఇంచార్జ్ చిలపల్లి శ్రీనివాసరావు వారి వెంట ఉన్నారు.

**నిర్మాణాత్మక చర్చలతో ముగిసిన సమావేశం**

**విడదల గోపీనాథ్ సభ్వత్వం రద్దు**

**శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆరోపణలు..**

**టీపీఎస్ హాజరు కాకపోవడంపై ఆగ్రహం**

# ఈ ఏడాది చివరి మున్సిపల్ సమావేశంలో అంతా ప్రజా పక్షమే..







**చిలకలూరిపేట టౌన్, డిసెంబర్ 30 (ఆంధ్రపత్రిక):** ప్రజా సమస్యలపై కౌన్సిలర్ల ప్రశ్నలు, అధికారుల సమాధానాలు ప్రతిపక్షం, పాలకపక్షం అనే తేడా లేకుండా సోమవారం జరిగిన మున్సిపల్ సమావేశంలో అందరూ ప్రజాపక్షం వైపు మొగ్గు చూపారు. నిర్మాణాత్మక చర్చలతో పాటు, కొందరు అధికారులపై విమర్శలు, ప్రశంసలు కూడా ఈ ఏడాది చివరి మున్సిపల్ సమావేశంలో చోటు చేసుకున్నాయి. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత కౌన్సిల్ సాధారణ సమావేశంతో పాటు బడ్జెట్ సమావేశం కూడా నిర్వహించారు.

**శానిటరీ ఇన్సెపెక్టర్‌పై ఆరోపణలు...:**

సభ ప్రారంభానికి ముందు మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందిన భారత మాజీ ప్రధాని మన్‌మోహన్‌సింగ్ సంతాపం ప్రకటించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని కలగజేసుకొని ఇటీవల మృతి చెందిన చిలకలూరిపేట మాజీ మున్సిపల్ చైర్మన్లు మాజేటి వెంకటేశ్వర్లు, బింగి రామూర్తి మృతికి సంతాపం తెలుపుదామని ప్రకటించారు. సభ వారి మృతికి మౌనం పాటించి సంతాపం ప్రకటించింది. అనంతరం మాట్లాడిన టీడీపీ సభ్యురాలు పాముల పాటి శివకుమారి మున్సిపాలిటీలో ఎంతమంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారని, వారు ఏఏ ప్రాంతాలలో పనిచేస్తున్నారో వివరాలు ఇవ్వాలని గతంలో కోరినా ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. ఓ శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఇంట్లో పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారని, అతని కారు డ్రైవర్‌గా కార్మికుడిని వినియోగిస్తున్నారని ఆరో పించారు. ఈ ఆరోపణలపై కమిషనర్ పి.శ్రీహరి బాబు స్పందిస్తూ కౌన్సిలర్ ఆరోపణలపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ పరిదిలో 271 మంది పారిశుధ్య కార్మికులతో పా టు 38 మంది పర్మినెంటు కార్మికులని వెల్లడించారు.

**గణపవరానికి పట్టణ మురుగు సమస్య తీర్చాలి:**

గణపవరానికి పట్టణ ముంపు సమస్య తీర్చాలని గతం నుంచి కోరుతున్నా పట్టించుకోవడం లేదని వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు ఆరోపించారు. ఇటీవల తవ్విన కాల్వలతో రోడ్డుబురదమయంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే అంశంపై మున్సిపల్ ప్రతిపక్ష నాయకుడు టీడీపీకి చెందిన గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మాజీ మంత్రి ఇంటి నిర్మాణం కోసం కాల్వల నిర్మాణాన్ని మార్చారని, ఇందువల్ల గణ పవరానికి మురుగు సమస్య మరింత జఠిలమైందన్నారు. ఇదే విషయంపై పాముల పాటి శివకుమారి తదితరులు మాట్లాడారు.

**టీపీఎస్ ఎక్కడ..?**

ఆక్రమణల తొలగింపులో వివక్ష చూపుతున్నారని టీడీపీ సభ్యుడు గంగా శ్రీను, బేరింగ్ మౌలాలి తదితరులు ఆరోపించారు. ఈ విషయంపై చైర్మన్ కలగజే సుకొని దీనిపై సమాధానం చెప్పాలని మున్సిపల్ కమిష నర్‌ను కోరారు. ఇటువంటి ఆరోపణల వల్ల ఎమ్మెల్యేకు చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ సమావేశానికి హాజరు కాకపోవడంపై గంగా శ్రీనివాసరావు తీవ్ర స్థాయిలో ఆగ్ర హం వ్యక్తం చేశారు. కౌన్సిలర్లకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆమెపై ఉందన్నారు. వైసీపీ కౌన్సిలర్ కోట్యానా యక్ సమయ పాలనపై ప్రశ్నించారు. 11గంటలకు ప్రారంబం కావాల్సిన సమావేశం ఎందుకు ఆలశ్యం అవు తుందని నిలదీశారు. తన వార్డు పరిధిలో లీకుల గురించి గత సమావేశంలో ప్రస్తావించిన ఎందుకు సమ స్య పరిష్కరానికి నోచుకోలేదన్నారు. పదో వార్డుకు చెంది న బేరింగ్ మౌలాలి మాట్లాడుతూ తన వినతిని మన్నించి కుక్కల నియంత్రణకు, బస్ షెల్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నందుకు కమిషనర్‌ను అభినందించారు.

**శుభాకాంక్షలకు ప్రకటనలు ఇవ్వాలి..**

కౌన్సిలర్ల తరుపున నూతన సంవత్సర ప్రకటనలు ఇచ్చే అవకాశం పరిశీలించాలని టీడీపీ కౌన్సిలర్లు గంగా శ్రీనివాసరావు, బేరింగ్ మౌలాలి కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఇలా ప్రకటనలు ఇచ్చారని, ఇదే విధంగా తమకు కూడా అవకాశం కల్పించాలని వారు కోరారు. ఈ అంశం పరిశీలిస్తానని కమిషనర్ తెలిపారు.

**విడదల గోపీనాథ్ సభ్వత్వం రద్దు..**

పట్టణంలోని 31వ వార్డు కౌన్సిలర్, మాజీ మంత్రి విడదల రజిని మరిది విడదల గోపీనాథ్ సభ్వత్వాన్ని సభ రద్దు చేసింది. వరుసగా గోపీ ఆరు సమావేశాలకు హాజరు కాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు టేబుల్ ఎజెండాలో పొందుపరిచారు.

**రూ.53.20 కోట్లతో బడ్జెట్ ఆమోదం...**

2025-26 సంవత్సారానికి రూ.53.20 కోట్లతో బడ్జెట్‌ను ఆమోదించారు. ఇందుకు సంబంధించి ప్రారంభ నిల్వగా రూ. 39.42 కోట్లు చూపారు. వివిధ మార్గాల నుంచి మున్సిపాలిటీకి రూ.35.35కోట్లు ఆదాయం రాగలదని అంచనా వేశారు. ఇందులో సాధారణ నిధుల మిగులు నుంచి అభివృద్ధి పనులకు రూ.3.20 కోట్లు, నీటి సరఫరాకు రూ.65 లక్షలు, కాల్వల అభివృద్ధి రూ. 42లక్షలు, పార్కుల అభివృద్ధికి రూ.35లక్షలు వెచ్చించనున్నారు. ఇందులో సాదారణ ఖర్చుల్లో జీతభత్యాలకు రూ. 3.24 కోట్లు పరిపాలన ఖర్చు రూ.1.81 కోట్లు, పారిశుధ్య నిర్వహణకు రూ.3.24 కోట్లు వెచ్చించనున్నారు.